
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5




శ్రీ పొట్టి శ్రీరాములు

నెల్లూరు

జిల్లా వార్తలు

సోమవారం 25 మార్చి 2024

ఉత్తర కాలువకు నీటి విడుదల పెంపు



అనంతసాగరం: సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, ఆదివారం నాటికి ప్రాజెక్టులో 11.080 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ ఉత్తర కాలువకు 50 నుంచి 300 క్యూసెక్కులకు నీటి విడుదలను పెంచారు. డెల్టాకు 1500, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

రంజాన్ వేళలు | ఇఫ్తార్ (సోమవారం) : 6.22 | సహరి (మంగళవారం) : 4.50

ఉష్ణోగ్రతలు | నెల్లూరు : 35.5 25.1 | కావలి : 35.0 25.0 | కందుకూరు : 34.0 26.0 | ఆత్మకూరు : 38.0 25.0 | ఉదయగిరి : 34.0 24.0



బిట్రగుంట వీధుల్లో సాగుతున్న ప్రసన్నుడి రథోత్సవం,(అంతర్‌చిత్రంలో) స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కమనీయం.. ప్రసన్నుడి కల్యాణం

- భారీగా తరలివచ్చిన భక్తజనం
- వైభవంగా శ్రీవారి రథోత్సవం
- గోవింద నామస్మరణతో మోరుమోగిన బిటకూలక్షేత్రం

బిట్రగుంట, మార్చి 24: బోగోలు మండలం కొండ బిట్రగుంట ప్రసన్నుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం స్వామివారి కల్యాణాన్ని అంగ రంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, ప్రాతఃకాలార్చన, సహస్ర నామార్చన, నివేదన కార్యక్రమాలు నిర్వహించారు. అలంకార ప్రియుడైన శ్రీనివాసుడు తన దేవేరులతో కల్యాణ మండపానికి మేళతాళాలు, మంగళవాయిద్యాలు, గోవింద నామస్మరణల మధ్య తరలివచ్చారు. కల్యాణోత్సవానికి ప్రభుత్వం తరపున కావలి ఆర్డీవో శీనానాయక్ దంపతులు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. కాగా తూర్పుగోదావరి జిల్లా మండపేట నుంచి తెచ్చిన శంఖు, చక్రనామాల కొబ్బరి బోండాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆలయ ఈవో రాధాకృష్ణ, పాలక మండలి చైర్మన్ శ్రీరామ్‌మాల్యాద్రి ఉభయకర్తలను ఆహ్వానించారు. అంతకుముందు విశ్వనాథరావుపేట తాళ్లూరు పంచాయతీల మధ్య అటవీ ప్రాంతంలోని స్వామివారి నిజపాదాల నుంచి తలంబ్రాలను మేళతాళాలతో ఊరేగింపుగా శ్రీవారి కల్యాణ వేదిక వద్దకు చేర్చారు.

వైభవంగా రథోత్సవం

కల్యాణం అనంతరం స్వామి,అమ్మవార్లు రథోత్సవానికి తరలివచ్చారు. బిట్రగుంట పంచాయతీలోని రెండు గ్రామాల వీధుల్లో రథోత్సవం వైభవంగా సాగింది. కావలి డీఎస్పీ వెంకటరమణ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామివారికి చక్రస్నానం నిర్వహించారు. రాత్రికి అలకలతోపు, అశ్వవాహనసేవ, ధ్వజఅవరోహణ, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఏసీ శ్రీనివాసులు, బ్రహ్మోత్సవాల ప్రత్యేక అధికారి చైతన్య, పీఎస్‌ఆర్ ట్రస్ట్ నిర్వాహకులు పీ.సుగుణ తదితరలు పాల్గొని, స్వామి,అమ్మవార్లను దర్శించుకున్నారు.

వైభవంగా హనుమంత సేవ



హనుమంత వాహనంపై ఊరేగుతున్న రంగనాథుడు

నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 24: నెల్లూరు నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామివారికి వైభవంగా హనుమంత వాహనసేవ జరిగింది. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఉదయం నిత్యపూజలు, పూలంగిసేవలు జరిగాయి. వెన్నత్తాళి తిరుచ్చి ఉత్సవంలో స్వామివారికి కనుల పండువగా అలంకరణ జరిగింది. సాయంత్రం మూలవర్లకు విశేష పూలాలంకారం చేశారు. రాత్రి స్వామివారికి ఏకాంత, ఊంజల్‌సేవ జరిగాయి. అనంతరం విశేష పుష్పాలంకారం, మంగళవాయిద్యాలు, విద్యుద్దీపాలంకరణలు, బాణసంచా వేడుకలతో రంగనాథుడు హనుమంత వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవం ఆలయం నుంచి సరస్వతీనగర్‌లోని మాగుంట సుబ్బరామిరెడ్డి స్వగృహం వరకు సాగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ ఉత్సవానికి ఉభయకర్తలుగా మాగుంట శ్రీనివాసులురెడ్డి, మాగుంట విజయారెడ్డి కుటుంబం వ్యవహరించారు. కార్యక్రమాలను ఆలయ చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ధర్మకర్తలు, సహాయ కమిషనర్, ఈవో డబ్బుగుంట వెంకటేశ్వర్లు తదితరులు పర్యవేక్షించారు. కాగా సోమవారం ఉదయం 9గంటలకు మోహినీ ఉత్సవం, రాత్రి బంగారు గరుడసేవ నిర్వహించనున్నారు.

మంట కలిసిన మార్గదర్శకాలు !

- మూడేళ్లు దాటినా జిల్లాలోనే పలువురు అధికారులు
- సొంతూరు నిబంధన వారికి వర్తించదా ?
- డీఆర్డీఏ పీడీ, డీపీవో, డీఏవో, జడ్పీ డిప్యూటీ సీఈవోలపై ఫిర్యాదులు
- డీఆర్డీఏ పీడీ, డీఏవో బదిలీ కాకుండా నోడల్ పోస్టుల మార్పు
- ఎన్నికల సమావేశాలకు యథావిధిగా హాజరు
- కృష్ణాలో అధికారుల సరెండర్‌తో చర్చనీయాంశం

నెల్లూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలను పాదర్శకంగా నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలు జిల్లాలో అభాసుపాలవుతున్నాయి. అధికారుల బదిలీలకు సంబంధించి ఈ ఏడాది జనవరిలో ఎన్నికల సంఘం స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. ఎన్నికల సమయం నాటికి మూడేళ్ల జిల్లాలో పనిచేసిన అధికారులను కచ్చితంగా బదిలీ చేయాలని సూచించింది. అలానే సొంత జిల్లాలో పనిచేస్తున్న జిల్లా స్థాయి అధికారులను కూడా అక్కడి నుంచి బదిలీ చేయాలని ఆదేశించింది. కొన్ని జిల్లా స్థాయి పోస్టులు ఎన్నికలతో సంబంధం లేకపోయినా వారి కింది స్థాయి సిబ్బంది ఎన్నికల విధుల్లో ఉన్నప్పుడు సదరు అధికారి వారిని ప్రభావితం చేసే ప్రమాదం ఉందని భావించిన ఎన్నికల సంఘం అటువంటి అధికారులను కూడా బదిలీల జాబితాలో చేర్చింది. ఈ మార్గదర్శకాల ప్రకారం చాలా మందిని జిల్లా నుంచి బదిలీ చేశారు. కానీ పలువురు కీలక పోస్టుల్లో ఉన్న అధికారులకు మాత్రం కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలు వర్తిస్తున్నట్లు కనిపించడం లేదు. మూడేళ్ల దాటిన వారు, సొంత జిల్లా వాసులైన జిల్లా స్థాయి అధికారులు ఇంకా జిల్లాలోనే కొనసాగుతున్నారు. పేరుకు మాత్రం వీరికి ఎన్నికల విధులు లేకపోయినా ఎన్నికల సమావేశాల్లో మాత్రం పాల్గొంటున్నారు. జిల్లాలోనే ఉంటూ పరోక్షంగా ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సదరు అధికారులపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా ఎన్నికల సంఘానికి కూడా ఫిర్యాదులు వెళ్లాయి. డీఆర్డీఏ పీడీ, జిల్లా ఆడిట్ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి, జడ్పీ డిప్యూటీ సీఈవోలు ఈ జాబితాలో ఉన్నారు. వీరు ఏ విధంగా ఎన్నికల నిబంధనల కిందకు రారో జిల్లా ఎన్నికల అధికారి స్పష్టం చేయాల్సి ఉంది.



ఈనెల 21న కలెక్టర్ నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొన్న సాంబశివారెడ్డి, తిరుపతయ్య, చిరంజీవి



ఈనెల 18న కమాండ్ కంట్రోల్ సెంటర్లో కలెక్టర్ నిర్వహించిన ఎన్నికల సమావేశంలో పాల్గొన్న సుశ్మితారెడ్డి

ఇంకా సొంత జిల్లాలోనే..!

ఈ జాబితాలోనే జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) సుశ్మితారెడ్డి, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో చిరంజీవిలు కూడా ఉన్నారు. సుశ్మితారెడ్డిది నెల్లూరు సొంత జిల్లా. ఆమె ఎంపీడీవోగా, సెంట్రల్ సీఈవోగా, డీపీవోగా మూడేళ్లకు పైగా జిల్లాలో విధులు నిర్వహిస్తున్నారు. కానీ ఎన్నికల నిబంధనల ప్రకారం బదిలీ కాలేదు. డీపీవో పోస్టు ఎన్నికలతో సంబంధం లేదంటూనే ప్రస్తుత డీపీవో కలెక్టర్ నిర్వహించే ఎన్నికల సమావేశాల్లో పాల్గొంటున్నారు. డీపీవో కింద పనిచేసే సిబ్బంది ఎన్నికల విధుల్లో ఉన్నారు. జడ్పీ డిప్యూటీ సీఈవో చిరంజీవిది కూడా నెల్లూ రు సొంత జిల్లా. ఇటీవల వరకు ఆయన ఇన్‌చార్జి సీఈవోగా కూడా వ్యవహరించారు. డిప్యూటీ సీఈవో పోస్టు ఎన్నికలకు సంబంధం లేదని చెబుతున్నా, ఆయన జిల్లా ఎన్నికల అధికారి నిర్వహించే ఎన్నికల సమావేశాల్లో పాల్గొంటున్నారు. ఇలా ఎన్నికలకు సంబంధం లేకపోయినా అధికారులు ఎలా ఎన్నికల విధుల్లో జోక్యం చేసుకుంటున్నారన్న ప్రశ్న తలెత్తుతోంది. అది కూడా జిల్లా ఎన్నికల అధికారి సమక్షం లోనే జరుగుతుండడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

కృష్ణాలో సరెండర్

కృష్ణా జిల్లాలో జడ్పీ సీఈవోతో పాటు పలువురు అధికారులు మూడేళ్లకు పైగా పనిచేస్తుండగా, వారి పోస్టులను ఎన్నికల విధుల్లో నుంచి తప్పించారు. దీంతో వారు ఇంకా ఆ జిల్లాలోనే కొనసాగుతూ ఎన్నికల సిబ్బందిపై ప్రభావం చూపుతున్నారని ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు అందడంతో రెండు రోజుల క్రితం అక్కడి కలెక్టర్ ఆ అధికారులను ప్రభుత్వానికి సరెండర్ చేశారు. ఆ వ్యవ హారం తర్వాత అదే మాదిరిగా జిల్లాలో కూడా అధికారులు ఉండడంతో ప్రస్తుతం ఉద్యోగ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మరి జిల్లాలోని అధికారులపై ఎన్నికల సంఘం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చూడాలి.

పోస్టులు తప్పించి.. ఎన్నికల విధుల్లో !

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్(డీఆర్డీఏ పీడీ) సాంబశివారెడ్డి 2020లో జిల్లాలో బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు జిల్లాలో మూడేళ్ల సర్వీస్ పూర్తయింది.గత ఎన్నికల్లో డీఆర్‌డీఏ పోస్టు అన్నది స్వీప్(ఎన్నికల ప్రచార కార్యక్రమాలు) నోడల్ అధికారిగా ఉండేది. ప్రస్తుతం అదే పోస్టును కొనసాగించి ఉంటే డీఆర్‌డీఏ పీడీ ఎన్నికల నిబంధనల ప్రకారం బదిలీ కావాల్సి ఉంది. కానీ ఈ దఫా ఆయన బదిలీ కాకుండా ఉండేందుకు స్వీప్ నోడల్ అధికారి పోస్టును నుడా వీసీ బాపిరెడ్డికి అప్పగించారు. అయినా సాంబశివారెడ్డి ఎన్నికలకు సంబంధించి స్వీప్ కార్యక్రమం కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నిర్వహించే ఎన్నికల సమావేశాలకు కూడా ఆయన హాజరవుతున్నారు. జిల్లా ఆడిట్ అధికారి(డీఏవో) తిరుపతయ్య కూడా మూడేళ్లకు పైగా జిల్లాలో పనిచేస్తున్నారు. గతంలో డ్వామా పీడీ కూడా పనిచేశారు. గడిచిన ఎన్నికల్లో డీఏవో పోస్టు జిల్లా ఎన్నికల ఖర్చుల కోఆర్డినేటర్‌గా ఉండేది. ఇప్పుడు కూడా అదే కొనసాగించి ఉంటే తిరుపతయ్య తప్పనిసరిగా బదిలీ కావాలి. కానీ ఆయన్ను బదిలీ చేయకుండా ఉండేందుకు జిల్లా ఎన్నికల ఖర్చుల కోఆర్డినేటర్ పోస్టును నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లోని అసిస్టెంట్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ పోస్టుకు బదిలీ చేశారు. దీంతో తిరుపతయ్య ఎన్నికల మార్గదర్శకాల్లోకి రారని చెప్పుకుంటున్నారు. కానీ పేరుకు అసిస్టెంట్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ ఉన్నా ఎన్నికల ఖర్చుల కోఆర్డినేటర్ వ్యవహారాలన్నీ తిరుపతయ్యనే చూస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కలెక్టర్ నిర్వహించే ఎన్నికల సమావేశాల్లోనూ తిరుపతయ్య పాల్గొంటుండడం గమనార్హం. ఇవన్నీ పక్కన పెట్టినా తిరుపతయ్య సొంతూరు నెల్లూరు జిల్లా. ఈ ప్రకారం చూసినా ఆయనను బదిలీ చేయాల్సి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

27న చంద్రబాబు రోడ్‌షో

నెల్లూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఈనెల 27వ తేదీన టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు నెల్లూరుకు రానున్నారు. ఆరోజు నెల్లూరు నగరంలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ముందుగా హెలికాప్టర్‌లో పోలీసు పరేడ్ మైదానం చేరుకొని, అక్కడి నుంచి కేవీఆర్ జంక్షన్- గాంధీ బొమ్మ- ట్రంకురోడ్డు మీదుగా నర్తకీ సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వరకు రోడ్‌షో నిర్వహిస్తారు. అనంతరం అక్కడ జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారు. ఈ మేరకు ప్రాథమిక షెడ్యూల్ ఖరారైంది. ఇందుకు సంబంధించి జిల్లా టీడీపీ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు.

7 రోజులు.. రూ.75.74 కోట్లు

2023-24 ఆర్థిక సంవత్సరం మరో 7 రోజుల్లో ముగిస్తుంది. ఈ లోపు రూ.75.74 కోట్ల పన్నులు వసూళ్లు చేయాలి. ఇదీ ప్రస్తుతం కార్పొరేషన్‌లోని రెవెన్యూ విభాగం ముందున్న లక్ష్యం. కానీ ఇది సాధ్యమేనా!? ఈ ఏడాది రూ.130.02 కోట్ల పన్ను వసూళ్లు లక్ష్యం కాగ ఇప్పటికి రూ.54.28 కోట్లను మాత్రమే రెవెన్యూ అధికారులు ఖజానాకు జమచేశారు. రానున్న 7 రోజుల్లో రూ.75.74 కోట్లు రాబట్టగలరా!? అన్నది ప్రశ్న. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ భవనాల నుంచి రూపాయి కూడా వసూళ్లు కాకపోతుండగా, ఖాళీ స్థలాల నుంచి పన్నును రాబట్టడంలో కార్పొరేషన్ అధికారులు నత్తతో పోటీపడుతున్నారు.



- నెల్లూరులో పన్ను వసూళ్లకు లక్ష్యం
- రూ.130 కోట్లకు రూ. 54 కోట్లే వసూలు
- నెలాఖరుతో ముగియనున్న ఆర్థిక సంవత్సరం
- ఎన్నికల విధుల సాకుతో చేతులెత్తేస్తున్న ఆర్‌ఐలు

నెల్లూరు (సిటీ), మార్చి 24 : నగర పాలక సంస్థ లెక్కల ప్రకారం 1,33,116 ప్రైవేట్ భవనాలు ఉండగా వీటి నుంచి ఈ ఏడాది రూ.97.86 కోట్లు ఆస్తి పన్ను వసూళ్ల చేయాల్సి ఉంది. కానీ రూ.45.70 కోట్లు మాత్ర మే వసూళ్ల అయింది. ఇక ఖాళీ స్థలాలు 6,567 ఉండగా, రూ.17.76 కోట్లు లాభం ఆర్జించాలని లక్ష్యం పెట్టుకోగా, కేవలం రూ.6.73 కోట్లు మాత్రమే వసూలు అయ్యింది. ఇక రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన 400 భవనాల నుంచి రూ.12.37 కోట్లు వసూళ్ల చేయాల్సి ఉండగా కేవలం రూ.1.83 కోట్లు మాత్రమే ఖజానాకు చేరాయి. కేంద్ర ప్రభుత్వ కార్యా లయాలు 36 ఉన్నట్లు లెక్కకట్టిన ఎన్ఎంసీ అధికారులు వాటి ద్వారా రూ.2.21 కోట్లు రావాల్సి ఉండగా, రూ.2 లక్షలు మాత్రమే వసూళ్ల అయింది. ఈ లెక్కన అన్నీ విభా గాల నుంచి 1,40,119 అసెస్‌మెంట్ల ద్వారా రూ.130.02 కోట్లు పన్ను వసూళ్ల లక్ష్యం పెట్టుకున్న రెవెన్యూ విభాగం అందులో కేవలం రూ.54.28 కోట్లు మాత్రమే వసూళ్ల చేశారు.

కలిసొచ్చిన ఎన్నికల క్రతువు

నెల్లూరులోని 54 డివిజన్లకు సుమారుగా 12 మంది ఆర్‌ఐలు, ముగ్గురు ఆర్వోలు, ఒక డీసీని పన్ను వసూళ్ల కోసమే కేటాయించారు. ఆర్థిక సంవత్సరం గడువు ముగిస్తున్న కొద్దీ కమిషనర్ వికాస్ పన్ను వసూళ్లపై పట్టుబట్టడంతో ఊపిరి పీల్చుకోలేని అధికారులకు సార్వత్రిక ఎన్నికల క్రతువు సాకుగా దొరికింది. ఆర్‌ఐలు అంతా పోలింగ్ బూతులు, బీఎల్వోలపై సూపర్‌వైజర్లుగా, ఆర్వోలు ఎన్నికల ప్రత్యక్ష ప్రక్రియలో ఉండటంలో పన్ను వసూళ్లకు బ్రేకులు పడుతున్నాయి. కాగ నెల్లూరులోని 166 సచివాలయాల సిబ్బంది ద్వారా పన్ను వసూళ్లకు పురామాయిస్తే ఆశించిన ఫలితాలు ఉంటాయని నిపుణులు పేర్కొంటున్నారు.

వారంలో సాధ్యమేనా!?

పన్ను వసూళ్లకు భారీ లక్ష్యంతో రంగంలోకి దిగిన కార్పొరేషన్ అధికారులు ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు లక్ష్యం చేరుకుంటారా!? అన్నది సర్వత్రా ఆసక్తిగా మారింది. ఖజానాలో రూపాయి లేని ఈ సమయంలో ఆదాయం వైపు ఏ మాత్రం పరుగులు తీస్తారన్నది కూడా చర్చనీయాంశంగా మారింది.

గీత దాటితే.. వేటు తప్పదు !

- పార్టీల ప్రచారంలో వలంటీర్లు, డీలర్లు, ఉపాధి సిబ్బంది, వీఏవోలు
- ఇప్పటికే కొందరి తొలగింపు
- అయినా ఆగని రాజకీయ జోక్యం

నెల్లూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఏరుదాటి తెప్ప తగలేసినట్లు... రాజకీయ నేతలను ఉద్దేశించి విస్తృతంగా ప్రచారంలో ఉన్న సామెత ఇది. అంతా తెలిసినా, ఇప్పుడు నెత్తినపెట్టుకున్న నాయకులు ఎన్నికల తరువాత ఎక్కడ పెడతారో స్పష్టంగా తెలిసినా కొంతమంది అమాయకంగా వ్యవహరిస్తున్నారు. విపరీతమైన స్వామి భక్తితో ఉన్న చిన్నపాటి ఉపాధి అవకాశాన్ని కూడా శాశ్వతంగా చేజార్చుకొంటున్నారు. ఒకరి పల్లకి మోసే మోజులో భార్య బిడ్డల భవిష్యత్తును ఫణంగా పెడుతున్నారు. ఎన్నికల సందర్భంగా అలాంటి సంఘటనలే చోటు చేసుకొంటున్నాయి. రాజకీయ నాయకుల మీద వెర్రి అభిమానంతో ఎన్నికల కమిషన్ వేటుకు గురవుతున్నారు. తమను నమ్ముకున్న కుటుంబ సభ్యులను వీధినపడేస్తున్నారు.

అయినా లెక్కచేయని వైనం

ఎన్నికల కమిషన్ ఎంత గట్టిగా ఆదేశించినా కొంత మంది హద్దు మీరుతూనే ఉన్నారు. అధికార పార్టీ ప్రచార కార్యక్రమంలో పాల్గొంటూ అడ్డంగా దొరికిపోయి ఉపాధి అవకాశాలను పోగొట్టుకొంటున్నారు. జిల్లాలో ఇలా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న 11 మంది వలంటీర్లను శాశ్వ తంగా విధుల నుంచి తొలగించారు. వీరితో పాటు ఉపాధి హామి ఫీల్డు అసిసెంట్లు, వీఏవోలు, రేషన్ షాపు డీలర్లను కూడా తొలగించారు. అయినా ఇంకా అక్కడక్కడా రాజకీయ కార్యకలాపాల్లో వారు పాల్గొం టూనే ఉన్నారు. తమకు ఇదివరకే ఏదో మేలు చేశారనో, భవిష్యత్తులో చేస్తారనో..! ఆశతో ఉన్న ఉపాధి అవకాశాన్ని పోగొట్టుకొంటున్నారు. కుటుంబ సభ్యులను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టడంతో పాటు మానసి కంగా కూడా వేదనకు గురిచేస్తున్నారు.

తెలుసుకో తమ్ముడూ...!

అవసరం పూర్తయిన తరువాత ఎదుటి మనిషి తీరులో మార్పు రావడం సహజం. రాజకీయ నాయకుల్లో ఈ స్వభావం మరి ఎక్కువ. ఎదుటి వారి కోసమో, నచ్చిన వ్యక్తి, పార్టీ కోసమో చేతనైన సాయం చేయడం మంచిదే. కాని అది హద్దుల్లో ఉండాలి. మీకు నచ్చిన పార్టీకి ఓటు వేసుకునే హక్కు మీకుంది. అదే మీకు నచ్చిన పార్టీకి ఓటే వేయండి అని ప్రచారం చేసే హక్కు మాత్రం ప్రభుత్వ పరిధిలో పనిచేసే ఉద్యోగులకు లేదు. ఆ తేడాను తెలుసుకొని జాగ్రత్తగా మలుచుకోవాల్సిన అవసరం ఉంది. ఈ రోజు ఆవేశంతో పట్టుకున్న జెండా, ఉద్యోగం పోతే అండగా నిలబడుతుందన్న గ్యారెంటీ లేదు. కాని ఉద్యోగం కోల్పోతే మాత్రం ఆర్థికంగా, సామాజికంగా మీరు మీ కుటుంబం పలుచన వుతారని, సంక్షోభంలో కూరుకుపోతారన్న సత్యాన్ని ఎన్నికల కమిషన్ ఆంక్షల చట్రంలో ఉన్న చిరు ద్యోగులు గుర్తించాల్సిన అవసరం ఉంది. నచ్చిన నాయకుడి కోసం నమ్ముకున్న కుటుంబానికి అన్యాయం చేయకూడదన్న వాస్తవాన్ని గుర్తించి నడుచుకోవాలి.



నిబంధన బేఖాతర్

ఎన్నికల ప్రచారంలో ప్రభుత్వ అధికారులు, సిబ్బంది పాల్గొనకూడదనే నిబంధన ఎప్పటి నుంచో ఉంది. అయితే ఇటీవల కొత్తగా ఏర్పడిన వలంటీర్ల వ్యవస్థను ఎన్నికల సంఘం ఈ జాబితాలో చేర్చింది. వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు వెనుకే రాజకీయ ప్రయోజనం ఉందని, సొంత పార్టీ కార్యకర్తలుగా వీరిని వాడుకోవటానికి వైసీపీ ప్రభుత్వం ప్రజాధనాన్ని వీరికి జీతంగా ఇస్తోందనే ఆరోపణలు ఎప్పటి నుంచో ఉన్నాయి. అసలు రాజకీయ కోణంలో వలంటీర్లు టార్గెట్ అయినంతగా మరేశాఖ ఉద్యోగులు కాలేదు. ఎన్నికల సంఘం సైతం ఈ ఆరోపణలతో ఏకీభవించిన క్రమంలో వలంటర్లు ఎన్నికల ప్రచారాల్లో కాని, ఎన్నికల విధుల్లో కాని పాల్గొనడానికి వీలు లేదంటూ ఆదేశించింది. వీరితోపాటు ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, వీఏవోలు, రేషన్ షాపు డీలర్లను కూడా ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదని ఆదేశించింది. ఈ నాలుగు కేటగిరీలవాళ్లు క్షేత్రస్థాయిలో ప్రజలతో సంబంధం ఉన్నవారే. ప్రజలను ప్రభావితం చేయగలిన అవకాశం ఉన్నవారే. ఈ కారణంగా ఎన్నికల కమిషన్ వీరిని గట్టిగా ఆక్షేపించింది. ఆదేశాలను కాదని హద్దు మీరితే శాశ్వతంగా తొలగించమని ఉత్తర్వులు ఇచ్చింది.

ఎట్టకేలకు ఇసుక రీచ్‌లకు బ్రేక్

- హైకోర్టు ఆదేశాలతో కదలిన యంత్రాంగం
- ఇప్పటికే ఇతర ప్రాంతాలకు ఇసుక డంపింగ్

నెల్లూరు (వెంకటేశ్వరపురం) మార్చి 24: జిల్లాలోని ఇసుక రీచ్‌ల్లో అనుమతి లేకుండానే సాగిస్తున్న తవ్వకాలను అధికారులు ఎట్టకేలకు నిలిపేశారు. ఐదేళ్లగా జేపీ, ఇటీవల ప్రతిమ సంస్థలు ఇష్టానుసారంగా జిల్లాలోని ఎనిమిది రీచ్‌లు,రెండు డీసిలిటేషన్ పాయింట్లు, పలు డంపింగ్ యార్డ్‌ల్లోనూ ఇసుక అమ్మకాలు సాగించాయి. ప్రతిపక్షాలతోపాటు మీడియా కూడా ఎన్నోసార్లు అక్రమాలను ఎత్తిచూపినా పట్టించుకోని అధికారులు ఎట్టకేలకు హైకోర్టు ఆదేశాలతో కదిలారు. జిల్లాలోని అన్ని ఇసుక రీచ్‌ల్లో అమ్మకాలకు ఆదివారం నుంచి బ్రేక్ వేశారు. పర్యావరణ అనుమతి లేకపోవడంతోపాటు నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా తవ్వకాలు జరుపుతున్నారని పలువురు హైకోర్టులో పిటీషన్లు వేశారు. స్పందించిన హైకోర్టు పూర్తిస్థాయి నివేదికలు ఇవ్వాలని ఆదేశించింది. దీంతో కలెక్టర్, మైనింగ్‌శాఖ అధికారులు పలు ఇసుక రీచ్‌లను పరిశీలించి నివేదికలు అందించారు. ఎన్నికల కోడ్ రావడంతో జిల్లా అధికార యంత్రాంగం వాస్తవ పరిస్థితులను హైకోర్టుకు నివేదించారు. దీంతో వెంటనే రీచ్‌ల్లో ఇసుక తవ్వకాలను హైకోర్టు నిలుపుదల చేస్తూ ఆదేశాలు ఇచ్చింది. కాగా హైకోర్టు ఆదేశాలతో అధికారులు రీచ్‌లను పరిశీలిస్తున్నారు.దీంతో వెంటనే నిర్వాహకులు అప్రమత్తమయ్యారు. ఎలాంటి పరిస్థితులు తలెత్తుతాయోనని రీచ్‌ల నుంచి ఇప్పటికే భారీగా ఇతర ప్రాంతాలకు ఇసుకను డంప్ చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా అక్రమార్కులు డంప్ చేసిన ఇసుకను కూడా అక్రమంగా తరలిస్తున్నారు.



పల్లెపాడు రీచ్‌లో భారీగా ఇసుక తవ్వకాలతో ఏర్పడిన గుంతలు

సేవలందించని ఆర్‌బీకేలు

- అందుబాటులో లేని ఎరువులు, పురుగు మందులు
- ప్రైవేటు దుకాణాలను ఆశ్రయిస్తున్న రైతులు
- అన్నదాతలకు భరోసా కల్పించేనా ?

నెల్లూరు (వ్యవసాయం), మార్చి 24: గ్రామస్థాయిలోనే రైతులకు అవసరమైన అన్ని సేవలను అందించేందుకు రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బీకే) ఏర్పాటు చేశామని సీఎం నుంచి సాధారణ నేత వరకు ఊక దంపుడు ఉపన్యాసాలు చేస్తుంటారు. నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు అందిస్తున్నామని కూడా గొప్పలు చెప్పుకుంటున్నారు. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. రైతులకు అవసరమైనని ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అందుబాటులో ఉండడం లేదు. దీంతో తప్పని పరిస్థితుల్లో వారు ప్రైవేటు దుకాణాలను ఆశ్రయించాల్సి వస్తోంది.

● ఐదులక్షల ఎకరాల్లో సాగు

జిల్లాలో సుమారు ఐదు లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతున్నాయి. వరి, వేరుశనగ, పత్తి, పొగాకు, జొన్న, మొక్కజొన్న, మామిడి, నిమ్మ, బొప్పాయి, అరటి, జామ వంటి పంటలతోపాటు కూరగాయలు, పూలమొక్కల సాగు కూడా జరుగుతోంది. 2023-24 రబీ సీజన్‌కు జిల్లాకు రూ.1,63,000ల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని జిల్లా వ్యవసాయాధికారులు అంచనా వేశారు. ఎరువులను మార్క్‌ఫెడ్, పురుగు మందులు, విత్తనాలను ఏపీ సీడ్స్ వారు సరఫరా బాధ్యతలను తీసుకున్నారు. అయితే అధికారుల అంచనాలకు మించి డీఏపీ, ఎస్ఎస్‌పీ, ఎంవోపీ, కాంప్లెక్సు ఎరు వులు దాదాపు 1,93,000ల మెట్రిక్ టన్నుల ఎరువుల విక్రయాలు జరిగినట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. కాగా జిల్లాలోని 545 ఆర్‌బీకేల ద్వారా విక్రయాలు సాగించింది మాత్రం కేవలం 34,183 మెట్రిక్ టన్నులు మాత్రమే. మిగిలిన ఎరువులన్నీ ప్రైవేటు దుకాణాల వద్ద రైతులు కొనుగోలు చేసినవే.

అవసరమైనన్ని ఎరువులు ఇస్తున్నాం...



ఆర్‌బీకేల ద్వారా రైతులకు అవసరమైనన్ని ఎరువులను అందిస్తున్నాం. అందుబాటులో ఉంచుతున్నాం. పురుగు మందుల విషయానికి వస్తే రైతుకు ఎన్ని లీటర్లు అవసరమో ముందుగా తెలియ జేసి డీడీ లేదా నగదు చెల్లిస్తే 24గంటల్లో అందిస్తున్నాం. రబీ సీజన్‌లో తెగుళ్ల ఎక్కువగా ఆశించకపోవడంతో పురుగు మందుల వినియోగం ఎక్కువ లేకుండా పోయింది. దాదాపు 221 లీటర్ల పురుగు మందులను విక్రయించాం.

- సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి

పురుగు మందులను కూడా సుమారు 221 లీటర్లు మాత్రమే అమ్మినట్లు అధికారులు చెపుతున్నారు. కొంతమంది రైతులతో ప్రైవేటు దుకాణాల వ్యాపారులు వ్యక్తిగత పరిచయాలు ఉండడం, ఎరువులు, పురుగు మందులు అప్పుగా ఇవ్వడంతో కొనుగోలు చేస్తున్నారని కొంతమంది వ్యవసాయశాఖ అధికారులు అంటున్నారు.

● ముందుగా నగదు చెల్లిస్తేనే..

జిల్లాలోని ఆర్‌బీకేల్లో ఎక్కడా కూడా చూసేందుకు పురుగు మందులు కనిపించని పరిస్థితి. కేవలం ఎరువులు మాత్రమే కొంతమేర అందుబాటులో ఉంటున్నాయి. అయితే పురుగు మందులు అవసరమైన రైతులు ముందుగానే నగదు చెల్లిస్తే ఆర్డరు పెడతామని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. పంటకు చీడపీడలు ఆశిస్తే వెంటనే పురుగు మందుల వాడకం అత్యవసరం. అయితే ఆర్‌బీకేలో సిబ్బంది మాత్రం నగదు చెల్లించిన తరువాత ఆర్డరు పెడతామని చెప్పడంతో పుణ్యకాలం కాస్తా గడిచిపోతోందని రైతులు ప్రైవేటు దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. రైతు అవసరాన్ని బట్టి దుకాణ నిర్వాహకులు అధిక ధరలకు అమ్మకాలు సాగిస్తున్నా, తప్పని పరిస్థితుల్లో కొనాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దూదేకులను అవహేళన చేస్తే అట్రాసిటీ కేసు

● నూర్‌బాషా దూదేకుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాజీ



మాట్లాడుతున్న బాజీ

కావలిటౌన్, మార్చి 24: దూదేకులను అవహేళన చేస్తే అట్రాసిటీ కేసులు తప్పవని నూర్‌బాషా దూదేకుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజీ హెచ్చరించారు. నూర్‌బాష దూదేకుల సంక్షేమ సంఘం కావలి డివిజన్ అధ్యక్షుడు షేక్ రఫి ఆధ్వర్యంలో పట్టణంలోని ఏబీఎస్ కల్యాణ మండపంలో జరిగిన దూదేకుల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో నూర్‌భాష దూదేకులు 15 లక్షల మంది ఉన్నా అధికారిక లెక్కల ప్రకారం కేవలం 5 లక్షలే చూపించడం దారుణమన్నారు. కొన్ని నియోజకవర్గాల్లో దూదేకులు గెలుపోటములను శాశించగలిగే స్థాయిలో ఉన్నప్పటికీ తగిన గుర్తింపు, గౌరవం లేకపోవడం శోచనీయమని వాపోయారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ల గడిచినప్పటికీ ఇప్పటికీ దూదేకులు ఒక్కరు కూడా ఎమ్మెల్యేగా అవకాశం దొరకకపోవడం చూస్తే ఎంత వెనుకబడిపోయామో అర్థం చేసుకోవచ్చన్నారు. అందుకు కారణం కేవలం దూదేకుల్లో ఐక్యత లేకపోవడం వల్లేనన్నారు. నూర్‌భాష దూదేకులకు 2 ఎమ్మెల్సీలు కేటాయించాలని డిమాండ్ చేశారు. దూదేకుల కులస్తుల సర్టిఫికెట్లలో ఇండియన్ హిందూ దూదేకుల అని వస్తుందని, ముస్లిం దూదేకు ల లేక ఇస్లాం దూదేకుల అని ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మస్తాన్‌బాషా, మహిళా అధ్యక్షురాలు షమీమ్, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి ఖాదర్‌బీ, రాష్ట్ర యువత అధ్యక్షుడు మట్టిపాటి బాషా, జిల్లా గౌరవాధ్యక్షురాలు షమీమ తదితరులు పాల్గొన్నారు.

నగదుతో నేతల ఆకర్షణ



అసంతృప్తిలో అధికార పార్టీ కార్యకర్తలు

కావలి, మార్చి24: ఇప్పటివరకు అధికారాన్ని అడ్డంపెట్టుకుని రాజకీయాలు చేసిన అధికార పార్టీ నేతలు ఎన్నికల షెడ్యూల్ రావటంతో వారి అధికారం పనిచేయలేదు. దీంతో నగదు పంపకాలతో రాజకీయాలు చేసేందుకు సన్నద్ధమయ్యారు. ఎన్నికల వేళ రాజకీయ పరిస్థితులను బట్టి నేతలు తమకు అనుకూలమైన పార్టీల్లోకి మారుతు న్నారు. ఎక్కువగా అధికార పార్టీ నుంచి ఇతరపార్టీల్లోకి వలసలు ఎక్కువగా ఉన్నాయి. వాటిని నివారించేందుకు అధికార పార్టీ నేతలు ఆకర్ష్ పథకాన్ని చేపట్టారు. అధికారం ఉన్న సమయంలో ఆ పార్టీలో ఐదారుగురు మాత్రమే కోట్లకు పడగలెత్తారు. దీంతో వైసీపీలో ఉన్న మిగతా నాయకులకు ఎన్నికల వేళ అవి గుర్తుకురావటంతో కొంత ముభావంగా ఉండిపోయారు. ఈ విషయాన్ని గమనించిన పార్టీ పెద్దలు గ్రామ, వార్డుల్లో చోటా నేతలు పార్టీ వీడకుండా వారికి వారి స్థాయిని బట్టి ఒక్కొక్కరికి రూ.50వేల నుంచి 3లక్షల వరకు నగదు అందచేసినట్లు ప్రచారం జరుగుతోంది. కేడర్ ఉత్సాహంగా పనిచేసేందుకు ఈ నగదు ఇస్తున్నట్లు చెప్పారు. ఇది తొలివిడత మాత్రమేనని ఆ తర్వాత వారి పనితీరును బట్టి మళ్లీ అందచేయటం జరుగుతోందనే ప్రచారం చేస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్న వార్డులు, గ్రామాలలో కింది స్థాయి చోటా మోటానాయకులను నగదుతో తృప్తి పరిస్తే తమ సంగతేమటన్న అసంతృప్తిలో కార్యకర్తలు ఉన్నారు. నేతలు ముందుగానే ముడుపులు తీసుకుంటుండటంతో చిన్నాచితకా కేడర్ మాత్రం తమను పట్టించుకునే వారు లేరా ? అని తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. నేతలకు, వలంటీర్లకు, పొదుపు మహిళలకు ఇలా అన్ని వర్గాలకు తాయిలాలు అందచేయగా పార్టీకోసం కష్టపడి పనిచేసే కార్యకర్తలపై ఎందుకు చిన్నచూపు చూస్తున్నారనే భావనలో వారు ఉన్నారు.

మతిస్థిమితంలేని వ్యక్తుల సంచారంతో హడలిపోతున్న మహిళలు

ఉదయగిరి, మార్చి 24: పట్టణంలో మతిస్థిమితంలేని వ్యక్తుల ఆగడాలు రోజురోజుకు మితిమీరిపోతున్నాయి. ఆర్టీసీ డిపో, బస్టాండ్ సెంటర్, మార్కెట్‌వీధి, గండిపాళెం రోడ్డు, తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయం ప్రాంతాల్లో వారి సంచారం అధికమైంది. పాడుపబడిన కార్యాలయాలు, బస్‌షెల్టర్లలో వీరు తిష్ట వేస్తున్నారు. వీరి చేష్టలకు మహిళలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఆయా మార్గాల్లో మహిళలు వెళ్లాలంటే వణికిపోతున్నారు. వీరి వికృత చేష్టలకు వివిధ కార్యాలయాలకు పని నిమిత్తం వచ్చే మహిళలు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే అటు నుంచి వెళ్లాలంటే విద్యార్థినులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికులతో పాటు స్థానికేతరులైన మతిస్థిమితం లేని వ్యక్తులు ఉదయగిరిలో అధికమయ్యారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి మతిస్థిమితం లేని వ్యక్తులను కట్టడి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో సచివాలయ ఉద్యోగి మృతి



విష్ణువర్ధన్‌రెడ్డి (ఫైల్)

అనంతసాగరం, మార్చి 24: మండలంలోని కొత్తపల్లి పంచాయతీలోని వెంకటరెడ్డిపల్లికి చెందిన కేతా విష్ణువర్ధన్‌రెడ్డి ఆదివారం పొలం వద్ద విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మరణించాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కేతా కృష్ణారెడ్డి, సందరమ్మ దంపతులకు ఇద్దరు సంతానం. అందులో పెద్ద కుమారుడు కేతా విష్ణువర్ధన్ రెడ్డి. ప్రస్తుతం ఈయన కామిరెడ్డిపాడు సచివాలయంలో సర్వే యర్‌గా పనిచేస్తున్నాడు. గ్రామంలో పొలం కౌలుకు తీసుకొని వరిసాగు చేస్తున్నాడు. అందులో భాగంగా సెలవు కావడంతో ఉదయం వరి పంటకు నీరు పెట్టేందుకు వెళ్లాడు. మోటారు వద్ద విద్యుత్ లింకులు తీస్తుండగా విద్యుత్ షాక్‌కు గురవడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. ఇంటి నుంచి విష్ణుకు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో కుటుంబసభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా విగతజీవిగా పడివుం డటంతో కన్నీరుమున్నీరుగా ఏడ్చారు. విష్ణువర్ధన్‌రెడ్డికి ఈ నెల 13న ఏఎస్‌పేట మండలం హస నాపురంకు చెందిన సంధ్యతో వివాహం జరిగింది. 10రోజుల్లోనే ఈ విషాదం చోటు చేసుకో వడంతో రెండు కుటుంబాలు దుఖసాగంలో మునిగిపోయాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

భయపెడుతున్న గన్ కల్చర్

● లైసెన్స్‌డ్ తుపాకీలు ఓకే..లైసెన్సులు లేనివి ఎన్నో? ● ఎన్నికల వేళ ఏమవుతుందో...?

నెల్లూరు(క్రైం), మార్చి 24: షెడ్యూల్ విడుదల కావడంతో జిల్లాలో సార్వత్రిక ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా పోలీసు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే జిల్లాలోని రౌడీషీటర్లు, గత ఎన్నికల్లో కేసులు నమోదు అయినవారు, పీడీ యాక్టులు, సస్పెక్ట్‌లను బైండోవర్ చేసుకున్నారు. వారి కదలికలపై నిఘా ఉంచారు. ఇక జిల్లాలో ఉన్న 533 లైసెన్స్‌డ్ ఆయుధాలను (బ్యాంకులను మినహాయించి)స్వాధీనం చేసుకున్నారు.

● గత సంఘటనలను పరిశీలిస్తే...



ఆయుధాల విషయంలో జిల్లాలో నాలుగేళ్ల కాలంలో చోటుచేసుకున్న వివిధ సంఘటనలు భయాందోళనకు గురి చేస్తున్నాయి. లైసెన్స్ లేకుండా ఇతర రాష్ట్రాల నుంచి తుపాకీ తీసుకు వచ్చి ఓ యువతిని హత్య చేసి, యువకుడు ఆత్మహత్య చేసుకోవడం, ఈడీ అధికారులమంటూ తుపాకీ చూపించి బంగారు నగలు దోపిడీకి యత్నించడం, కావలిలో ఓ ఇంట్లో పోలీసులు చేపట్టిన తనిఖీల్లో తుపాకీ స్వాధీనం చేసుకోవడం చూస్తుంటే లైసెన్స్ లేకుండా జిల్లా వ్యాప్తం గా ఎన్ని తుపాకులు ఉన్నాయి.. ఎంతమంది తుపాకీలను ఉపయోగిస్తున్నారు.. ఎన్ని కలవేళ బెదిరింపులకు గురి చేసేందుకు లైసెన్స్ లేని తుపాకీలను ఉపయోగించే అవకాశం ఉందా... ? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

● సంచలనంగా మారిన గన్‌లు

జిల్లాలో గత ఎన్నికల నుంచి తాజా ఎన్నికల వరకు చూసుకుంటే లైసెన్స్ లేని గన్‌లను వినియోగించడం, వాటిని చూపించి బెదిరింపులకు దిగడం సంచలనంగా మారాయి.

● 2022లో నెల్లూరు నగరంలోని లావణ్య జ్యూయలరీస్‌లో దోపిడీకి యత్నించిన ముఠా సభ్యులను పోలీసులు అరెస్ట్‌చేసి వారి వద్ద నుంచి తుపాకీ స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో విచారణ చేపట్టిన పోలీసులు చెన్నైలో నకిలీ ఐడీ కార్డులు, పోలీసు యూనిఫారమ్ కొనుగోలు చేయడంతోపాటు రూ.7 వేలు చెల్లించి ఎయిర్ పిస్టల్‌ను కొనుగోలు చేసినట్లు తేల్చారు.

● పొదలకూరు మండలం తాడిపర్తిలో జరిగిన ఘటన జిల్లాలోనేకాక రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. తనతో పెళ్లికి అంగీకరించలేదని ఓ యువకుడు తుపాకీతో యువతిని హతమార్చి, తాను అదే గన్‌తో కాల్చుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ కేసులో తుపాకీ ఎక్కడి నుంచి వచ్చిందని పోలీసులు లోతుగా విచారణ జరపగా, బిహార్‌లో తుపాకీ కొనుగోలు చేసినట్లు తేలింది.

● కాగా ఇటీవల కావలిలో పోలీసులు ఓ రౌడీ షీటర్ ఇంట్లో తనిఖీలు చేసి తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. ఇలా జిల్లాలో అనుమతులు లేని తుపాకీలతో హత్యలు, దోపిడీ యత్నాలు, బెదిరింపులు జరిగిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికలు సమీపిస్తున్న వేళ అనుమతులు లేని తుపాకీలు ఇంకా ఉన్నాయా... ? వాటితో నేతలు బెదిరింపులకు పాల్పడతారా ? అన్న భయాందోళనలు ప్రజలను వెంటాడుతున్నాయి.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	128
లేయర్ లైవ్	73
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	254
లేయర్	125

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6326
వెండి కిలో ధర	రూ. 77,400
వెండి ఒక గ్రాము	రూ. 79.40

గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(హరనాథపురం), మార్చి 24 : ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ నిర్వహిస్తున్న గురుకుల పాఠశాలల్లో 5, 6, 7, 8 తరగతులలో మిగిలి ఉన్న ఖాళీల భర్తీకి ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆ పాఠశాలల కన్వీనర్ మురళీకృష్ణ కోరారు. ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ జిల్లాలోని గండిపాళెం(బాలురు), తుమ్మలపెంట (బాలికల) గురుకులాల్లో 2024-25 విద్యాసంవత్సరానికి ఆయా తరగతుల్లో సీట్లు ఖాళీ ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గల వారు ఈనెల 31లోగా జ్ఞిఇట్బఇట్బఇఛిజఉఞీ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. నెల్లూరులోని మైనార్టీ గురుకుల పాఠశాలలో మైనారీ (బాలురు) విద్యార్థులకు మాత్రమే ఏలాంటి ప్రవేశ పరీక్ష లేకుండా నేరుగా ప్రవేశం కల్పిస్తామని పేర్కొన్నారు. మిగిలిన వారికి ఏప్రిల్ 25న ప్రవేశపరీక్ష నిర్వహిస్తారన్నారు. పూర్తి వివరాలకు 8712625045నంబరును సంప్రదించాలని కోరారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

● ఏపీజీఈఎఫ్ జిల్లా చైర్మన్ చేజర్ల

నెల్లూరు(హరనాథపురం), మార్చి 24 : ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఏపీజీఈఎఫ్ జిల్లా చైర్మన్ చేజర్ల సుధాకర్‌రావు కోరారు. ఆదివారం నెల్లూరులోని ఓ ప్రైవేటు భవంతిలో అగ్రికల్చరల్ మార్కెటింగ్ అసోసియేషన్ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటరత్నం, ఏపీజీఈఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవిరెడ్డి రమణారెడ్డి, వైస్ చైర్మన్ నవీన్, మార్కెటింగ్ శాఖ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవసహాయం, రియాజ్, జిల్లా అధ్యక్షుడు సుబ్బారావు, కార్యదర్శి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల అధికారి ఆకస్మిక తనిఖీలు



మద్యం దుకాణాల్లో రికార్డులు పరిశీలిస్తున్న నియోజకవర్గ ఎన్నికల అధికారి చిన్న ఓబులేసు

మనుబోలు, మార్చి 24 : ఎన్నికలు సమీపి స్తున్న తరుణంలో సర్వేపల్లి నియోజకవర్గ ఎన్ని కల అధికారి చిన్న ఓబు లేసు ఆదివారం మండలంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కల్యాణ మండపాలు, మద్యం దుకాణాలు, చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు చేపట్టారు. కల్యాణ మండపాల్లో ఎలాంటి కార్యక్రమాలు జరగాలన్నా ముందుగా తహసీల్దార్ అనుమతి తీసుకోవాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే మద్యం దుకాణాల్లో ఎవ్వరికీ ఎక్కువగా మద్యం అమ్మకాలు చేయరాదని సూచించారు. చెక్‌పోస్టు వద్ద పోలీసులు చేస్తున్న వాహనాల తనిఖీలను పరిశీలించి వారికి సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అజయ్ కుమార్ పాల్గొన్నారు.

వెంకటాచలంలో వైసీపీ జెండాల దర్శనం

● స్థానిక నాయకుల ఫిర్యాదుతో తొలగించిన అధికారులు



వడ్డిపాళెం వద్ద జాతీయ రహదారిపై వైసీపీ జెండాలు

వెంకటాచలం, మార్చి 24 : వెంకటాచలం పంచాయతీలో ఆదివారం సాయంత్రం మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం ఉండడంతో ఆపార్టీ నాయకులు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి వడ్డిపాళెం వద్ద జాతీయ రహదారి పొడవునా, వెంకటాచలంలో విద్యుత్ స్తంభాలు, ఇళ్లపై వైసీపీ జెండాలు ఏర్పాటు చేసి కోడ్‌ను ఉల్లంఘించారు. దీనిపై స్థానిక టీడీపీ నాయకులు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎంపీడీవో ముజుబున్నీసా తన సిబ్బందితో కలిసి బహిరంగ ప్రదేశాలు, రహదారిపై ఏర్పాటుచేసిన వైసీపీ జెండాలను తొలగించారు. కానీ ఇళ్లపై ఏర్పాటుచేసిన జెండాలను మాత్రం వదిలేశారు. దీనిని అధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. ఇంటి యాజమాని అనుమతితో మూడు జెండాల వరకు ఇళ్లపై కట్టుకోవచ్చన్నారు.

ఏపీజీఈఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రమణారెడ్డి



రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎంపికైన రమణారెడ్డిని సన్మానిస్తున్న కేఆర్ సూర్యనారాయణ

నెల్లూరు (హరనాథపురం), మార్చి 24 : ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీ ఈఏ) రాష్ట్ర ఉపా ధ్యక్షుడిగా జిల్లాకు చెందిన ఏనుగ రమణారెడ్డిని ఆ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ నియమించారు. ఉద్యోగుల కోసం రమణారెడ్డి చేస్తున్న సేవలను గుర్తించి ఆయనను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎంపిక చేశారు. రమణారెడ్డి ఇటీవల వరకు ఏపీజీఈఏ జిల్లా కమిటీ అధ్యక్షుడిగా పనిచేశారు. ఈ కార్యక్రమంలో ఏపీజీఈఏ రాష్ట్ర కార్యదర్శి జీ శ్రీనివాసులురెడ్డి, జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి పీపీఎస్‌టీ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తలసీమియా డే కేర్‌కు రూ.25 లక్షల విరాళం

● త్వరలో 20 పడకల క్లినిక్ ● రెడ్‌క్రాస్ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి



విరాళం అందిస్తున్న దాతలు

నెల్లూరు(వైద్యం), మార్చి 24 : రెడ్‌క్రాస్ తలసీమియా డే కేర్ సెంటర్‌కు డీపీ గోల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ దిలీప్ జైన్, రాహుల్ జైన్ రూ.25 లక్షల విరాళాన్ని అందించారు. ఆదివారం రెడ్‌క్రాస్ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కమిటీ చైర్మన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి ఈ విరాళం చెక్కును అందించారు. చైర్మన్ మాట్లాడుతూ రాబో యే రోజుల్లో తలసీమియా సెంటర్‌ను 20 పడకల క్లినిక్‌గా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ప్రతి ఏడాది తలసీమియా బాధితులకు 1500 యూనిట్ల రక్తాన్ని ఉచితంగా అందిస్తున్నామని వెల్లడించారు. ఈ క్లినిక్‌లో చిన్నారులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తలసీమియా ప్రాజెక్టు కన్వీనర్ డాక్టర్ సీత, రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ దామిశెట్టి సుధర్‌నాయుడు, కోశాధికారి సురేష్‌కుమార్ జైన్, కమిటీ సభ్యులు దాసరి రాజేంద్రప్రసాద్, యడవల్లి సురేష్, ప్రసాద్‌రెడ్డి, కలికి శ్రీహరిరెడ్డి, ప్రసన్నాంజనేయులు, వాకాటి విజయకుమార్‌రెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధిని నియంత్రించాలి

క్షయనివారణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలీ



మాట్లాడుతున్న డాక్టర్ ఖాదర్‌వలీ

నెల్లూరు(వైద్యం), మార్చి 24 : జిల్లాలో క్షయవ్యాధిని సమష్టిగా నియంత్రించాల్సిన అవస రం ఉందని జిల్లా క్షయనివారణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలీ వెల్లడించారు. ఆదివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం జరిగింది. ఆయన మాట్లాడుతూ క్షయవ్యాధి అంటే ఒకప్పుడు రోగులకు దూరంగా ఉండేవారని ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. ఎన్నో రకాల మందులు అందుబాటులో ఉన్నాయని తెలియచేశారు. ప్రస్తుతం జిల్లాలో 1903 మంది రోగులు క్షయకు వైద్యం పొందుతున్నారని చెప్పారు. వైద్య విధాన పరిషత్ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ రమేష్‌నాథ్ మాట్లాడుతూ క్షయవ్యాధి గ్రస్తులకు అన్ని రకాల పరీక్షలు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే నిర్వహిస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులలో 60 శాతం మంది క్షయ బారినపడే అవకాశం ఉందని తెలిపారు. అనంతరం క్షయ నివారణకు కృషిచేసిన వారికి అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విధుల నుంచి వీఆర్‌వో తొలగింపు

చేజర్ల, మార్చి 24: పాడేరులో మార్చి 18న జరిగిన మేకపాటి విక్రమ్‌రెడ్డి చేపట్టిన విజయీభవయాత్రలో పాల్గొన్న పాడేరు వీఆర్‌వో కాల్వ లక్ష్మీనరసింహప్రసాద్‌ను విధుల నుంచి తొలగిస్తూ కలెక్టరు, ఎన్నికల అధికారి ఎమ్.హరినారాయణన్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. అదే విధంగా తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఉత్తర్వులో పేర్కొన్న విధంగా నియమ నిబంధనలు తప్పక పాటించాలని పేర్కొన్నారు.

డీలర్‌పై చర్యలకు ఆర్డీవోకు నివేదిక

కలువాయి, మార్చి 24: అధికార పార్టీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కేశమనేనిపల్లి చౌక దుకాణం డీలర్ పామూరు రమేష్‌పై ఆత్మకూరు ఆర్డీవోకు ఎంపీడీవో మరియు ఎన్నికల ప్రవర్తన నియమావళి (ఎంసీసీ) నోడల్ అధికారి పీఎంఆర్ ప్రభాకర్ నివేదిక సమర్పించి నట్లు ఆదివారం తెలిపారు.

స్నేహితుడిపై హత్యాయత్నం

నెల్లూరు(క్రైం), మార్చి 24: స్నేహితుడిపై హత్యాయత్నం చేసిన ఘటనపై సంతపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరులోని కోటమిట్టకు చెందిన షేక్ మసూద్, బారకాస్ సెంటర్‌కు చెందిన సోహైల్ స్నేహితులు. ఇటీవల వారి మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో సోహైల్ ఈ నెల 23వ తేదీ శనివారం అర్ధరాత్రి మసూద్‌కు ఫోన్‌చేసి మాట్లాడుకోవడానికి రంగనాయకులపేట గొల్లవీధికి రావాలని కోరాడు. దీంతో మసూద్ మరో వ్యక్తితో కలిసి అక్కడికి వెళ్లాడు. అప్పటికే సోహైల్ తన స్నేహితుడైన రైలువీధికి చెందిన జావీద్, సాధిక్, సుభాన్, నవాజ్‌తో కలిసి అక్కడున్నారు. సోహైల్ మసూద్ మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. దీంతో సోహైల్ తన స్నేహితులతో కలిసి మసూద్‌పై దాడి చేశాడు. కత్తితో పొడిచి అక్కడి నుంచి పరారయ్యాడు. గాయపడ్డ మసూద్‌ను స్థానికులు వైద్యశాలకు తరలించారు. బాధితుడు ఆదివారం ఫిర్యాదు చేయడంతో హత్యాయత్నం కేసు నమోదు చేశామని, నిందితుల కోసం గాలిస్తున్నామని సంతపేట పోలీసులు తెలిపారు.

పసుపు పంట.. సిరులే ఇంట..



పొలంలో పసుపు పంట నిల్వలు

ఉదయగిరి రూరల్, మార్చి 24: మండలంలోని కొండకిందపల్లితో పాటు సమీప గ్రామాలకు చెందిన రైతులు పసుపు పంటను సాగు చేసి అధిక లాభాలు పొందుతున్నారు. ఐదు దశాబ్దాలుగా రైతులు పసుపు పంట సాగు చేస్తున్నారు. గత దశాబ్ద కాలంగా పసుపు పంటకు ధరలు లేక రైతులు అల్లాడుతున్న వీరికి ఈ ఏడాది ధరలు ఆకాశాన్నంటుదుతుండడంతో అన్నదాతలు అధిక లాభాలు పొందుతున్నారు. మండలంలో గతేడాది జూన్, జులై మాసంలో పసుపు పంట సాగు చేశారు. ఎకరా పసుపు పంటకు దున్నకం, విత్తనం, ఎరువులు, పురుగుమందులకు పెట్టుబడికి ఎకరానికి రూ.1.30 లక్షల వరకు ఖర్చు చేశారు. ఇలా 124.38 ఎకరాల్లో పంటను సాగు చేశారు. ప్రస్తుతం ఎకరాకు 60-70 పుట్ల పసుపు దిగుబడి వస్తుంది. 2009లో పుట్టి ధర రూ.2,500 నుంచి రూ.3వేలు పలికింది. ప్రస్తుతం పుట్టి రూ.7,500 నుంచి రూ.8వేలు పలుకుతోంది. వ్యాపారులు పొలంలోనే దిగుబడులను కొనుగోలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో దిగుబడి, ధర ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఇంట పంట సిరులు కురిపిస్తోంది.

మంచి లాభాలు వచ్చాయి



తాను మూడెకరాల్లో రూ.3.90 లక్షల పెట్టు బడి పెట్టి పసుపు పంట సాగు చేశా. ప్రస్తుతం తవ్వకాలు జరుపుతుండడంతో 200 పుట్ల దిగు బడి వచ్చింది. వ్యాపారులు పుట్టి రూ.8 వేల చొప్పున పొలంలోనే కొనుగోలు చేశారు. పెట్టు బడులు పోనూ మంచి ఆదాయం వచ్చింది.

- దేవసాని శ్రీనివాసులరెడ్డి, రైతు, కృష్ణారెడ్డిపల్లి

ఆశాజనకంగా ధర..దిగుబడి



దశాబ్ద కాలం తరువాత పసుపు పంట దిగుబడి, ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. తనకున్న రెండెకరాలతో పాటు మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని రూ.10 లక్షల పెట్టుబడి పెట్టి పసుపు పంట సాగు చేశా. 400 నుంచి 450 పుట్ల వరకు దిగుబడి వచ్చింది. వ్యాపారులు పొలంలోనే పుట్టి రూ.8 వేల చొప్పున కొనుగోలు చేశారు.

- బండి ప్రసాద్, రైతు, కొట్టాలు



రియల్ ఎస్టేట్

నెల్లూరు-సిటీ, రూరల్, బుచ్చి, కాకుపల్లిలలో ప్లాట్లు, అపార్ట్‌మెంట్‌లు, ఇండ్లు అమ్మదలచిన వారు కొనదలచిన వారు సం.ప్ర. దుర్గా రియల్ ఎస్టేట్, సెల్: 86390 76658

AJR-178267

WANTED

MS Naidu Auto Finance నందు పనిచేయుటకు Online Work అనుభవం కలిగిన వ్యక్తులు కావలెను. సం.ప్ర. సెల్: 99598 29998, 88855 57997

AJR-178036

హోమ్ డెలివరి

నెల్లూరు, కావలి పట్టణ పరిధిలో హోల్‌సేల్ రేట్లకే మీ ఇంటికి కావలసిన ప్రొవిజన్స్, ఆర్గానిక్ ఫ్రూట్స్, విజిటబుల్స్ హోమ్ డెలివరి ఇవ్వబడును. సం.ప్ర.99494 03047

AJR-178213

WANTED

Wanted Female telecallers & admin Full time Location: Nellore Qualification: inter/ degree. Ph: 96669 87978, 70321 19838

AJR- 156544

మూలికా వైద్యం

» అంగస్తంభన లేకపోవటం, సెక్స్‌లో ఎక్కువసేపు చేయలేకపోవడం, అంగం లావుగా, దృఢంగా, బలంగా ఉండుటకు మూలికాఔషధం. వయస్సు పైబడిన వారు కూడా వాడవచ్చు. డా.సిహెచ్.రామకృష్ణ VJA. సెల్ : 84650 56299

AJB-1054

అమ్మబడును

■ నెల్లూరు జిల్లా, కందుకూరు టౌన్‌లో రూ.30,000/-ల అద్దె వచ్చు ఇల్లు అమ్మబడును. మరియు ఇంటి స్థలం గది రూ.25,000/-కు కలదు. నూతన బైపాస్ ప్రక్కన ప్లాట్లు, పొలము అమ్మబడును, కొనబడును. సంప్ర: 97042 50705

AJO-183695

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, బట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.
పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

అరవపాలెంలో పలువురు టీడీపీలో చేరిక

సంగం, మార్చి 24: జండాదిబ్బ పంచాయతీలోని అరవపాలెంకు చెందిన అత్తిపాటి రామచంద్రయ్య ఆధ్వర్యంలో కరకంబాకం ఆది, హజరత్తయ్య, మస్తాన్, తాండ్ర రాధయ్య, నెల్లూరు ప్రసాద్, చంద్రశేఖర్, అత్తిపాటి పెంచలయ్య, మల్లి, హజరత్తయ్య, విటపురెడ్డి బాలాజీ, తాండ్ర నవీన్‌లు ఆదివారం టీడీపీలో ఆనం రామనారాయణరెడ్డి సమక్షంలో టీడీపీలో పార్టీలో చేరారు. నెల్లూరులోని ఆనం రామనారాయణరెడ్డి స్వగృహంలో టీడీపీ కండువా వేసి పార్టీలోకి స్వాగతించారు. కార్యక్రమంలో ఆనం ప్రసాద్ రెడ్డి, రఘురామయ్య ఉన్నారు.

కుల్లూరులో వైద్య శిబిరం

కలువాయి, మార్చి 24: కుల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం ప్రముఖ న్యూరాలజిస్ట్ బిందుమీనన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మూర్ఛ, పక్షవాతం, కీళ్ల నొప్పుల రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు బిందుమీనన్‌తో పాటు గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనపై ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది

అనంతసాగరం, మార్చి 24: మండలకేంద్రంలో ఆదివారం వైద్యసిబ్బంది క్షయవ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో మానవహారం చేపట్టారు. టీబీ వ్యాధి లక్షణాలు, నిర్మూలన పద్ధతులను ప్రజలకు వివరించారు. అనంతసాగరం పీహెచ్‌సీలో టీబీ, నాట్ పరీక్షలు అందుబాటులోకి వచ్చినట్లు వైద్యులు శ్రీకాంత్‌రెడ్డి, శ్రావణి తెలిపారు.

బీసీ నాయకుల సమావేశం



మన్నేటి వెంకటరెడ్డిని సన్మానిస్తున్న ఫోరం సభ్యులు

ఉదయగిరి రూరల్, మార్చి 24: గంగిరెడ్డిపల్లిలోని స్వగృహంలో ఏఎంసీ చైర్మన్ మాజీ మన్నేటి వెంకటరెడ్డి మండల బీసీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఉమ్మడి ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్‌లను అధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. అలాగే ఆంధ్రప్రదేశ్ కన్జూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరమ్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మన్నేటి వెంకటరెడ్డిని సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు తిరుపాలు, సభ్యులు కదిరి రంగరావు, మేకపాటి మాల్యాద్రినాయుడు పాల్గొన్నారు.

ఉచిత ప్రవేశాలకు గడువు పెంపు

ఉదయగిరి, మార్చి 24: పేద విద్యార్థులు ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతిలో ఉచిత ప్రవేశాలకు గడువు పెంచినట్లు ఉదయగిరి ఎంఈవో-2 తోట శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 31లోపు సమీప సచివాయాలు, మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బూత్ కన్వీనర్లకు శిక్షణ

మర్రిపాడు, మార్చి 24: బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంతో ఇంటింటికి ఆరు గ్యారెంటీలను తీసుకెళ్లాలని 43బూత్ కన్వీనర్లకు ఆదివారం టీడీపీ మండలాధ్యక్షుడు ఆరికట్ల జనార్ధన్‌నాయుడు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు శాఖ మూరి నారాయణ, మాజీ మండలాధ్యక్షుడు సుబ్బారెడ్డి, తలచీరు సుబ్బరాయుడు, లక్ష్మీనరసయ్య, యలగాల వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, సురేష్ పాల్గొన్నారు.

పెట్రోలు బంకుల తనిఖీ

చేజర్ల, మార్చి 24: ఆదురుపల్లిలోని ఇండేన్, హెచ్‌పీసీఎల్ పెట్రోలు బంకులను ఆదివారం తహసీల్దారు కే.గోపికృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మార్చి 16 నుంచి జరిగిన విక్రయాలను పరిశీలించారు. ఎన్నికల నేపథ్యంలో ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేసే వారి వివరాలను తహసిల్దారు కార్యాలయానికి తెలియజేయాలన్నారు. ముఖ్యంగా రాజకీయ పార్టీల ర్యాలీ సమయాల్లో బైక్‌లతో పాటుఇతర వాహనాలకు పెట్రోలు, డీజిల్ పట్టించటం వంటివి జరుగుతాయని, వీటిని అభ్యర్థి ఎన్నిలకు ఖర్చులకు జమచేసి వాటి వివరాలను కూడా తెలియజేయాలన్నారు. అనంతరం బంకుల్లో నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఉదయగిరి రూరల్, మార్చి 24: పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన పొదిలి తిరుపాలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకొన్న టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు వారి కుటుంబసభ్యులకు ఆర్థిక సహాయం ప్రకటించారు. ఆదివారం టీడీపీ నాయకులు బాధితకుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేలను అందజేశారు. టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, ఓబులరెడ్డి, నల్లిపోగు రాజా, నరసింహా, కాంతారావు, మట్ల మురళి పాల్గొన్నారు.

ప్రేక్షకులు మెచ్చిన చిత్రం



కావలి	-	శ్రవంతి
కందుకూరు	-	యువరాజు
వింజమూరు	-	జనార్ధన్ మహల్
గూడూరు	-	సప్తగిరి శ్రీనివాస
లింగసముద్రం	-	విజయలక్ష్మి

CONTACT 8374991228

చేతిపంపులు.. నిరుపయోగం



సీతారామపురం బస్టాండ్ కూడలిలో నిరుపయోగంగా చేతి పంపు

సీతారామపురం: మండలంలోని 14పంచాయతీల్లో 550 చేతిపంపులున్నాయి. వాటిలో అతి తక్కువ చేతిపంపులు మాత్రమే పని చేస్తున్నాయి. కొన్ని తుప్పు పట్టి ఉన్నాయి. అన్ని గ్రామాలకు తాగునీటి పథకాలతో నీటి సరఫరా జరుగుతోంది. ఇటీవల విద్యుత్ కోతలతో వివిధ ప్రాంతాల్లో నీటి సరఫరాకు తీవ్ర అంతరాయలు కలుగుతున్నాయి. ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో తరచూ విద్యుత్ సమస్యలు పెరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో చేతిపంపులే ప్రత్యామ్నాయం అయ్యాయి. ఇవి సరిగా పనిచేయకపోవడంతో ప్రజలు నీటి ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. గ్రామీణప్రాంతాల్లో 50శాతం మేరకు చేతిపం పులుతుప్పు పట్టి, మొండెం లేకుండా రోడ్లపై దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. లక్షల ప్రజాధనం వెచ్చించి వీటిని ఏర్పాటు చేస్తే మరమ్మతులకు నోచుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు.

ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు



సంగం: ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న అధికారుల బృందం

సంగం, మార్చి 24: పెన్నా నది ఇసుక రీచ్ నుంచి ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ సెబ్, రెవెన్యూ, మైనింగ్ అధికారుల బృందం హెచ్చరించారు. ఆదివారం వారు సంగం ఇసుక రీచ్‌ను పరిశీలించారు. అధికారుల వస్తున్నారని సమాచారం అందుకున్న రీచ్ నిర్వాహకులు యంత్రాలను గట్టు మీద ఉన్న ముళ్ల పొదలచాటుకు తరలించారు. రీచ్‌లో వాహనాలు లేకపోవడంతో అధికారుల బృందం వెనుతిరిగింది. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో ఇసుక తరలింపుకు అనుమతి లేదన్నారు. వారివెంట మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, విజిలెన్స్ ఏడీ బాలాజీనాయిక్, సెబ్ సీఐ యశోధర, తహసీల్దారు రమాదేవి తదితరులు ఉన్నారు.

అనంతసాగరం: సోమశిల సమీపంలోని పడమటికంబంపాడు ఇసుకరీచ్‌ను ఆదివారం మైనింగ్, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. ఇసుక అక్రమ రవా ణాకు సంబంధించిన వివరాలు సేకరించారు. నిబంధనలకు విరుద్ధంగా రవాణా జరిగేతే చర్యలు తప్పవన్నారు.

నాయకులతో టీడీపీ లీగల్‌సెల్ అధ్యక్షుడి సమావేశం

సీతారామపురం, మార్చి 24: స్థానిక తెలుగుదేశం కార్యాలయంలో నాయకుడు చింతల శ్రీనువాసులు ఆధ్వర్యంలో ఆదివారం కార్యకర్తలు, నాయకులతో సమావేశం అయ్యారు. ముఖ్య అతిథిగా నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు సందిరెడ్డి రామారావు మాట్లాడారు. నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు 8మండలాలకు లీగల్ సెల్ కమిటీని ఏర్పాటు చేశామని, ఎలాంటి ఇబ్బంది వచ్చినా పరిష్కరించేందుకు పార్టీ లీగల్ సెల్ కమిటీ సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు, జిల్లా ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి జాషువా, మండల క్లస్టర్ ఇంచార్జి వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, షేక్‌బాబు, చెన్నకేశవులు, గాజులపల్లి చంద్రారెడ్డి, పిడుగు రమేష్, రఘు, ఇజ్రాయిల్ ,తిరుపతయ్యమండల ట్రస్ట్ కోఆర్డినేటర్ సుమన్ పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం



అనంతసాగరం: వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

అనంతసాగరం: స్థానిక సెంటనరీ తెలుగు బాపిస్టు చర్చిలో ఆదివారం మట్టల వేడుక నిర్వహించారు. సండే స్కూల్ చిన్నారులు, సంఘం పెద్దలు, సభ్యులు ఈత మట్టలను అలంకరించి ప్రత్యేక ర్యాలీ చేపట్టారు. చర్చిలో ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ రాజ్‌కుమార్, వడ్లపల్లి వెంకటేశ్ పాల్గొన్నారు.



ఉదయగిరిలో..

ఉదయగిరి: గండిపాళెం, వెంగళరావునగర్, వీరారెడ్డిపల్లి, ఉదయగిరి, గన్నేపల్లి, సర్వరాబాదు, కృష్ణంపల్లి, బోడబండ, దాసరిపల్లి గ్రామాల్లో క్రైస్తవ సోదరులు మట్టల ఆదివారాని నిర్వహిం చారు. మట్టలను చేతబట్టి ప్రదర్శనగా చర్చిలకు ప్రార్థనలు చేశారు. కార్యక్ర మంలో పాస్టర్ సుధీర్‌కుమార్, సంఘ పెద్దలు ప్రసాదరావు, జాషువా, బెస్లింగ్టన్, రాబర్ట్ ప్రభాకర్, ఏసుదాసు పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా ఆర్టీసీ రోడ్డు, బస్టాండు

వింజమూరు, మార్చి 24: పట్టణంలోని ఆర్టీసీ రోడ్డు..ఆర్టీసీ బస్టాండు మందుబాబులకు అడ్డాగా మారింది. ఈ రోడ్డులో బ్రాందీ షాపు, సినిమా హాలు, ఆర్టీసీ బస్టాండు ఉన్నందున ప్రయాణికులు సినీప్రేక్షకులు తాకిడి ఎక్కువగా ఉంటుంది. బ్రాందీ షాపు పక్కన బెల్ట్‌షాపులు ఏర్పాటు చేసుకుని ఉదయం 5గంటల నుంచి రాత్రి 10గంటల వరకు మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా నిర్వహిస్తున్నారు. అత్యధిక రేట్లు అమ్ముకుంటూ మందుబాబులకు ఎనీటైం మందు అందజేస్తున్నారు. మందుబాబులు రోడ్డుమీదే మద్యం సేవిస్తూ అక్కడే మూత్రవిసర్జన చేస్తూ రోడ్డును అసౌకర్యంగా, అపరిశుభ్రంగా తయారు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో రాత్రి కాదు, ఉదయం వెళ్లేందుకు మహిళలు, చిన్నపిల్లలు జంకుతున్నారు. నిత్యం జనసంచారం ఉన్న ఈ రోడ్డు మీద మద్యం షాపును తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

వైద్యులు, వైద్య సిబ్బందికి ప్రతిభా అవార్డులు



ఉదయగిరి రూరల్ : ప్రశంసాపత్రం అందుకుంటున్న దుత్తలూరు వైద్యులు అయూబ్ అప్సర్



కలువాయి : అవార్డుతో చలమయ్య

కలువాయి: తోపుగుంట సబ్‌సెంటర్ హెల్త్ అసిస్టెంట్ చలమయ్య ఆదివారం జిల్లా క్షయవ్యాధి నివారణ అధికారితో జిల్లా స్థాయి ప్రతిభా అవార్డు తీసుకున్నారు.



అవార్డు అందుకుంటున్న ఉదయగిరి వైద్య సిబ్బంది

ఉదయగిరి రూరల్: గండిపాలెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం హెల్త్ అసిస్టెంట్ మన్సూర్ అలీ, ఏఎన్ఎం స్వాతి, ఆశ కార్యకర్త అంకమ జిల్లా క్షయ వ్యాధి నియంత్రణాధి కారి ఖాదర్‌వలి చేతుల మీదుగా ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందుకున్నారు. ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా నెల్లూరు డీఎంహెచ్‌వో కార్యాల యంలో జరిగింది.

దుత్తలూరు (ఉదయగిరి రూరల్): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు అయూబ్‌అప్సర్, ఆరోగ్య పర్యవేక్షకులు ఖాజామొహిద్దీలు ఉత్తమ సేవలు అందించినందుకు ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు పొందారు. జిల్లా క్షయవ్యాధి నియంత్రణాధికారి ఖాదర్‌వలి చేతలు మీదుగా వారు ప్రశంసాపత్రం అందుకున్నారు.

శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న శివలీల

ఆత్మకూరు, మార్చి 24: ప్రతి మనిషి మాంసాహారాన్ని వీడి శాకాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యవంతుడు అవుతాడని సీనియర్ పిరమిడ్ మాస్టర్లు శివలీల, డాక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆదివారం స్థానిక షిర్డీసాయి పిరమిడ్ కేంద్రంలో నిర్వహించిన ధ్యాన శిక్షణా తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. మనిషిలో ప్రశాంతత పెరిగేకొద్దీ శక్తిసామర్థ్యాలు పెరిగి.. విజయాలు సాధిస్తాడని చెప్పారు. ధ్యానసాధకులు సజ్జనసాంగత్యంతో పాటు ఆత్మవిజ్ఞాన పుస్తకాలు ఎక్కువగా చదవాలన్నారు. బుద్ధభగవానుడి అష్టాంగమార్గం మనశ్శాంతికి, ముక్తికి మంచిమార్గమని వివరించారు. కార్యక్రమంలో చంద్రా విజయమ్మ, మూరంరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, పలువురు ధ్యాన సాధకులు పాల్గొన్నారు.

ఉదయగిరిలో మేకపాటి పర్యటన

ఉదయగిరి రూరల్, మార్చి 24: వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆదివారం పట్టణంలోని నాగులబావివీధి, సుద్ధబావివీధి, రజకవీధి, వాల్మీకివీధుల్లో గడపగడపకు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ ఓబులరెడ్డి, ఎంపీపీ మూలె పద్మజా వినయ్‌రెడ్డి, జెడ్పీటీసీ మోడి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

సీతారామపురం : పోకలవారిపల్లిలో కాకి జాన్‌చిన్నయ్య సంతోషమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘటిక సిద్దేశ్వరం కూడలి వద్ద ఆదివారం టీడీపీ నాయకులు చింతల శ్రీనువాసులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జాషువా, వీ వెంకటేశ్వర్లు, షేక్ బాబు, చెన్నకేశవులు, గాజులపల్లి చంద్రారెడ్డి, రఘు, ఇజ్రాయిల్, పీ రమణయ్య, మాజీ ఎంపీపీ అబ్రహం పాల్గొన్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

పల్లెలే నయం!

- శివారు ప్రాంతాల్లో తిష్టవేసిన సమస్యలు
- పన్నుల భారం తప్ప కానరాని అభివృద్ధి



అధ్వానంగా బుడమగుంట ప్రాంతంలోని రోడ్డు

కావలిటౌన్, మార్చి 24: కావలి పట్టణ శివారు ప్రాంతాలైన బుడమగుంట, మద్దూరుపాడు, ముసునూరు ప్రాంతాలను 2014లో పట్టణ పరిధిలో విలీనం చేశారు. అయినా ఎక్కడ చూసినా మట్టి రోడ్లు, మురుగు నిల్వలు, పేడ దిబ్బలు తప్ప అభివృద్ధి జరిగిన దాఖలాలే లేవు. పేరుకే పట్టణం.. పన్నుల భారం తప్ప అభివృద్ధి జరగక ఎక్కడికక్కడ సమస్యలు తిష్టవేసి కనీస వసతులు కరువై ప్రజలు అల్లాడుతున్నారు. అయినా పాలకులు, అధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదు. దీంతో పల్లెలే నయంగా ఉన్నాయి. పన్ను పోట్లు, ఆస్తుల రిజిస్ట్రేషన్ చార్జీలు పెరగడం తప్ప ఒరిగిందేమీ లేదని ఆప్రాంతాల ప్రజలు వాపాతున్నారు.

- బుడమగుంట, మద్దూరుపాడు, ముసునూరు ప్రాంతాల్లో ప్రధానం గా రోడ్లు, డ్రైన్లు, తాగునీటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా రు. నాలుగు చినుకులు పడితే మట్టి రోడ్లు రొచ్చుగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. డ్రైన్‌ల నిర్మాణం చేపట్టకపోవడంతో ఎక్కడ మురుగు అక్కడే నిల్వ చేరి దుర్గంధభరిత వాతావరణం నెలకొనడంతో పందులు, దోమలకు నిలయాలుగా మారుతున్నాయి. దోమల వల్ల సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలుతూ ప్రజలు అనారోగాల భారిన పడుతున్నారు. ఆ ప్రాంతాల్లో ప్రభుత్వ ఆసుపత్రులు లేకపోవడంతో పట్టణంలోని ఏరియా వైద్యశాలను ఆశ్రయిస్తూ అధిక వ్యయప్రయాసలకు లోనవుతున్నారు. తాగేందుకు శుద్ధి నీరులేక అందుబాటులో ఉండే బావుల నీరు, మున్సిపాలిటీవారు వాటర్ ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసే కలుషిత నీరే తాగాల్సిన దుస్థితి.

పట్టణ అభివృద్ధికి పాలకులు అధికారులు రూపొందించిన మాస్టర్ ప్లాన్‌లో శివారు ప్రాంతాలకు ప్రాధాన్యత కల్పించకపోవడం, వాటి ఊసేలేకపోవడం చూస్తుంటే బుడమగుంట, ముసునూరు, మద్దూరుపాడు ప్రాంతాలు పట్టణంలో విలీనమయ్యాయా లేక పల్లెటూర్లుగానే ఉన్నాయా అర్థం కావడం లేదు. మాస్టర్ ప్లాన్‌లో శివారు ప్రాంతాలకు కూడా ప్రాతినిధ్యం కల్పించి ఆప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

- పట్టణ పరిధిలో ఎంతోకొంత అభివృద్ధి జరుగుతు

మాస్టర్ ప్లాన్‌లో శివారు ప్రాంతాలేవి?

న్నప్పటికీ శివారు ప్రాంతాల అభివృద్ధి పట్ల పాలకులు, అధికారులు చిన్నచూపు చూస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. పాత పట్టణ పరిధిలోని ప్రాంతాల్లో వేసిన సీసీ రోడ్లపైనే రోడ్లు వేసుకుంటున్నారని, రోడ్లు లేక మట్టి రోడ్లతో ఇబ్బందులు పడే శివారు ప్రాంతాలను పట్టించుకోవడం లేదన్నది స్థానికుల ఆరోపణ. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకుండా ట్యాంకర్ల ద్వారా కలుషిత నీరు సరఫరా చేస్తూ దొంగ లెక్కలు చూపిస్తూ నేతలు, అధికారులు జేబులు నింపుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి.

అండగా ఉంటాం.. టీడీపీని గెలిపించండి

- టీడీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



టీడీపీ, జనసేన, బీజేపీల సమావేశంలో వేమిరెడ్డి, ఇంటూరి

కందుకూరు, మార్చి 24 : రాబోయే రోజుల్లో కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం, రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని, మీ అందరికి అండగా ఉంటామని, ప్రతి ఒక్కరు తెలుగుదేశం విజయం కోసం కృషి చేయాలని నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోరారు. కందుకూరులో ఆదివారం రాత్రి జరిగిన తెలుగుదేశం, జనసేన, బీజేపీల నియోజకవర్గస్థాయి ఆత్మీయ సమావేశం వేమిరెడ్డి పాల్గొన్నారు. అంతకు ముందు పెద్దబజారులోని సీతారామ కల్యాణ మండపంలో జరిగిన ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశంలోనూ ఆయన పాల్గొన్నారు. కందుకూరు నియోజకవర్గ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతు రానున్న రోజుల్లో ఎంపీగా కందుకూరు నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలా అండదండలు అందిస్తానని, ఎమ్మెల్యేగా ఇంటూరి నాగేశ్వరరావుని, ఎంపీగా నన్ను గెలిపించేందుకు మూడు పార్టీల కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని కోరారు.



వేమిరెడ్డికి గజమాలతో స్వాగతం పలుకుతూ...

ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి తనవంతు తోడ్పాటుని అందిస్తానన్నారు. కందుకూరు నియోజకవర్గ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతు రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో మాఫియా ప్రభుత్వం నడుస్తుందని, సంక్షేమ పథకాల పేరుతో ప్రజలకు తాయిలాలు ఇచ్చి నిలువు దోపిడీ చేశారని విమర్శించారు. చివరికి డ్రగ్స్, గంజాయి, ఎర్రచందనం స్మగ్లింగ్‌లో కూడా వైసీపీ నేతలు మునిగిపోయి యువత భవిష్యత్తుని సర్వనాశనం చేశారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం ఖాయమని కందుకూరులో తెలుగుదేశం పార్టీ ఘనవిజయం సాధించి తీరుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, నాయకులు చల్లా శ్రీనివాసరావు, జనిగర్ల నాగరాజు, నార్నె రోశయ్య, ముచ్చు శ్రీను, మాదాల లక్ష్మీ నరసింహం, ఎన్వీ రమణయ్య, పిడికిటి వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య సంఘం నాయకుడు దూండీ రాకేష్, బీజేపీ నాయకులు ఘట్టమనేని హరిబాబు, ఉన్నం భాస్కరరావు, మన్నెపల్లి వరప్రసాదరావు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

వేమిరెడ్డికి ఘన స్వాగతం : వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి సింగరాయకొండ సమీపంలో జాతీయ రహదారిపై కందుకూరు అడ్డరోడ్డు వద్ద ఇంటూరి నాగేశ్వరరావుతోపాటు డెయిరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు, దామా మల్లేశ్వరరావు, ఇతర పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికి భారీ వాహన కాన్వాయ్‌గా కందుకూరుకి తీసుకొచ్చారు. తొలుత మాజీ ఎమ్మెల్యే దివి శివరాం నివాసంకు చేరుకున్న వేమిరెడ్డి, ఇంటూరిలు ఆయనతో చర్చించారు. ఈ సందర్భంగా వైసీపీకి చెందిన సూరం చిరంజీవి రెడ్డి, పులిచర్ల సుబ్బారెడ్డిలతోపాటు గుడ్లూరు, లింగసముద్రం మండలాలకు చెందిన వైసీపీ కార్యకర్తలు, నాయకులు వేమిరెడ్డి సమక్షంలో ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు.

టీడీపీలోకి వాల్మీకి సంఘం నాయకులు

కందుకూరు, మార్చి 24: కందుకూరు పట్టణంలోని పలు వార్డులకు చెందిన వాల్మీకి సామాజికవర్గం నాయకు లు ఆదివారం వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీకి జై కొట్టారు. నల్లబోతుల మురళి, జల్లి రంగస్వామి, పాలేటి హైమావతిల ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన వాల్మీకి సంఘ నేతలకు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అలాగే గుడ్లూరు మండలం స్వర్ణాజీపురంకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో కందుకూరులోని టీడీపీ కార్యాలయానికి చేరుకుని తెలుగుదేశం పార్టీలో చేరారు. కాగా నాగేశ్వరరావుకు టికెట్ దక్కడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఎస్సీసెల్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంకమ్మ ఆలయంలో టీడీపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ క్రిస్టియన్‌సెల్ అధ్యక్షుడు రెబ్బవరపు మాల్యాద్రి అన్నదానం చేశారు. నాయకులు దామా మల్లేశ్వరరావు, చిలకపాటి మధుబాబు, షేక్ రఫీ, ముచ్చు వేణు, గుడ్లూరు మండలానికి చెందిన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

దళితుడిని చంపి డోర్ డెలివరీ చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

బిట్రగుంట, మార్చి 24: దళితుడిని చంపి డోర్ డెలివరీ చేసిన నరరూప రాక్షసులను కఠినంగా శిక్షించాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం బోగోలులో అంబేద్కర్ విగ్రహ కూడలిలో దళిత, బీసీ నేతలతో కలసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తూరు జిల్లా పాచిగుంట దళితవాడకు చెందిన సుధాకర్ గ్రావెల్ మాఫియాపై తిరగబడడంతో. మాకే అడ్డం పడుతావా అంటూ గ్రావెల్ మాఫియా డాన్ నాగరాజు ఉదయాన్నే సుధాకర్ ఇంటికి వెళ్లి అందరు చూస్తుండగా తీసుకెళ్లి అతికిరాతకంగా ముక్కలు చేసి సాయంత్రానికి కుటుంబ సభ్యులకు అందచేయడం దారుణమన్నారు. జగనన్న పాలనలో దళితులను కిరాతకంగా హత్యలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరి తేజ, సాదుప్రసాద్, దుగ్గిరాల తిరవళ్లూరు, ఎల్.వెంకటకిశోర్, తదితరులు పాల్గొన్నారు.

పసుపులేటి గూటికి పాటిబండ్ల



పాటిబండ్లకు కండువా కప్పుతున్న పసుపులేటి

కావలిరూరల్, మార్చి 24: కావలిరూరల్ మండలం కొత్తపల్లికి చెందిన పాటిబండ్ల క్రిష్ణయ్య ఆదివారం కావలి నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేయనున్న పసుపులేటి సుధాకర్‌ను కలిసి ఆయనకు మద్దతు తెలిపారు. దీంతో ఆయన కండువా వేసి ఆహ్వానించారు. గతంలో టీడీపీలో ఉండిన క్రిష్ణయ్య కొంత కాలంగా ఆపార్టీకి దూరంగా ఉంటూ వైసీపీతో సఖ్యతగా మెలుగుతుండారు. ఇప్పుడు స్వతంత్ర అభ్యర్థి సుధాకర చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు నచ్చి ఆయన వెంట నడుస్తున్నట్లు చెప్పారు.

పేద వృద్ధులను ఆదరించాలి



నిత్యావసరాలు అందజేస్తున్న వైద్యులు

కావలి, మార్చి 24: ఉమ్మడి కుటుంబాలు అంతరించిపోతున్న తరుణంలో వృద్ధులకు ఆదరణ తగ్గిందని, పేద వృద్ధులను ప్రతి ఒక్కరు ఆదరించాలని సీనియర్ డాక్టర్లు శాంతకుమారి, క్రిష్ణమూర్తిలు పేర్కొన్నారు. డీఆర్ విశ్వోదయ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని వెంగళరావునగర్‌లో ఉన్న ఆ సేవా సమితి కార్యాలయంలో 70 మంది పేద వృద్ధులకు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయలు విలువ చేసే బియ్యం, నిత్యావసర సరుకులు, నగదు అందచేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ డీఆర్ సమాజానికి చేసిన సేవలు అమూల్యమని, ఆయన మార్గంలో విద్యాసంస్థలు నిర్వహిస్తూ పేదలకు సేవలు అందిస్తున్న ఆయన కుమారులు వినయకుమార్‌రెడ్డి, విద్యాధర్‌రెడ్డిలు అభినందనీయులన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వోదయ రెక్టార్ వినయ్‌కుమార్‌రెడ్డి, సేవాసమితి డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సభ్యులు నల్లూరు రామకృష్ణ, సతీష్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతాప్‌రెడ్డి పతనమే లక్ష్యంగా పనిచేయాలి : కావ్య



టీడీపీలో చేరిన కాపు నేతలతో కావ్య, మాలేపాటి

కావలి, మార్చి 24: కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డిని రాజకీయంగా పతనం చేయడమే లక్ష్యంగా సమష్టిగా పనిచేయాలని కావలి టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని మానసహాల్ సెంటర్‌లోని 3వ క్లస్టర్ కార్యాల యంలో జరిగిన సమావేశంలో అభ్యర్థి కావ్య క్రిష్ణారెడి, మాజీ ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడు సమక్షంలో 34వ వార్డుకు చెందిన ఊసా వెంకట్రావు, 28, 30 వార్డులకు చెందిన నాగిశెట్టి మాలకొండయ్య నాయుడు తదితర కాపు నేతలు తమ అనుచరులతో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. 35వ వార్డుకు చెందిన కొమరా రమణయ్య, చిట్టిపల్లి మనోహర్, కుంచాల ప్రేమకుమార్, షేక్ నాగూరువలి ఆధ్వర్యంలో పలువురు ముస్లింలు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్రకార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ క్రిషోర్, నేతలు పోతుగంటి అలేఖ్య, కొండూరు పోలిశెట్టి, పోట్లూరు శ్రీనివాసులు, మన్నవ రవిచంద్ర, సూరిశెట్టి రామక్రిష్ణ, జనసేన నాయకులు పొబ్బా సాయివిఠల్, రుషికేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల పరిచయ వేదిక

టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డితో కావలి పట్టణ ఆర్యవైశ్యుల పరిచయ వేదిక కార్యక్రమం ఆదివారం స్థానిక బృందవనం హౌసింగ్ కాలనీ కల్యాణ మండపంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ అధ్యక్షుడు టంగుటూరి రామక్రిష్ణ, బీజేపీ సీనియర్ నాయకుడు కందుకూరి వెంకటసత్యనారాయణ, మాజీ మున్సిపల్ చైర్మన్ పోతుగంటి అలేఖ్య పాల్గొన్నారు

స్థిరాస్తులను లాగేసుకునే కుట్ర

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో ప్రజల స్థిరాస్తులను లాగేసుకునేందుకు జగన్‌రెడ్డి కుట్ర పన్నారని కావలి టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ క్రిషోర్, జనసేన నియోజకవర్గ లధికారప్రతినిధి రుషికేష్ తదితరులు పాల్గొన్నారు.

వంద మంది టీడీపీలో చేరిక

జలదంకి, మార్చి 24: మండలంలో బ్రాహ్మణక్రాకకు చెందిన మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాలరెడ్డి అనుచరులు బీసీ నాయకుడు వల్లెపు వేడుకొండలు, ఎస్సీ నాయకుడు గోచిపాతల మాలకొండయ్య, కావలి మధుబాబుల ఆధ్వర్యంలో 100 మందికిపైగా ఆదివారం నెల్లూరు పార్లమెంటు అభ్యర్థి వేమిరెడి ప్రభాకరరెడ్డి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. నెల్లూరులోని వేమిరెడ్డి కార్యాలయంలో పార్టీలో చేరిన వారికి వేమిరెడ్డి, వంటేరులు పార్టీ కండువాకప్పి ఆహ్వానించారు.

వైసీపీ వార్డు మెంబరు...

బిట్రగుంట : బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ వైసీపీ 1వ వార్డు మెంబరు కాకాని రమేష్ ఆదివారం మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు, పైడి హర్ష, దాసరి శ్రీనువాసులు ఆధ్వర్యంలో కావలి టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు ఎల్.సుధీర్‌బాబు, రావినూతలరాము, తదితరులు ఉన్నారు.

ఘనంగా పాండురంగడి కల్యాణోత్సవం

పొదలకూరు, మార్చి 24: తాటిపర్తిలో పాండురంగస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణం ఘనంగా జరిగింది. అగ్ని గుండ మహోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన జిల్లాస్థాయి పండరి భజన పోటీల్లో భజన ఆదూరుపల్లి చీర్ల శ్రీనివాసులు యాదవ్ బృందానికి మొదటి బహుమతి లభించింది.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింట్ M/s. Shriram Finance Ltd., Nellore-2 బ్రాంచి మేనేజర్ వారు ఇచ్చిన బోగొట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది శ్రీమతి పార్లపల్లి వెంకట సుజాత భర్త వెంకట సుధాకర్ రావు, పార్లపల్లి గ్రామం, విడవలూరు మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా గారికి సంబంధించిన ఈ క్రింది షెడ్యూలులో చూపిన స్థిరాస్తిని రిజిస్టరు తనఖా చేయించుకొని శ్రీ పార్లపల్లి వెంకట జితేంద్ర తండ్రి వెంకట సుధాకర్ రావు గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకొన్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూలు స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి ఋణాలు, ఛార్జీలు క్లెయిములు, తనఖాలు, అగ్రిమెంట్, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న యెడల నేటి నుండి 7 దినములలో ఈ క్రింది చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియ జేయగలరు. తదుపరి అభ్యంతరములకు నా క్లయింట్ బాధ్యులు కారు.

SCHEDULE

నెల్లూరు డి.రి. ఋలాకా నెల్లూరు సబ్ రిజిస్ట్రారులో చేరిన నెల్లూరు బిట్-2 ప్రస్తుతం నెల్లూరు మున్సిపల్ లిమిట్స్ లో చేరిన సర్వేనెం.1224రు భూమిని లేఅవుట్ వేయించి సదరు లేఅవుట్ డైరెక్టర్ ఆఫ్ ప్లానింగ్ ఆఫ్ హైదరాబాద్ వారి వల్ల L.P.No.75/91రు గా మేము వగైరాలు జాయింట్‌గా అప్రూవ్ చేసుకొని సదరు ప్లాను అప్రూవు కాబడిన ప్లాను దాఖలా ప్లాట్లలో నెం.5రు ప్లాటు ఖాళీ స్థలమునకు హద్దులు:- తూర్పు: నెం:4రు ప్లాటు, దక్షిణం: నెం: 6రు ప్లాటు, పడమర: లేఅవుట్ రోడ్డు, ఉత్తరం: లేఅవుట్ రోడ్డు. ఈ హద్దులలోని 37 అంకణములా 36 చదరపు అడుగులకు 250.838 చదరపు మీటర్లు ఖాళీ స్థలమున్నూ యిందుకు సంబంధించిన యావత్ ఈజ్‌మెంట్ హక్కులతో సహా.

Perepi Venugopal, B.Com., B.L., Advocate, Tekkemitta, Nellore. Cell: 8374259528

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింట్ M/s. Shriram Finance Ltd., Nellore-2 బ్రాంచి మేనేజర్ వారు ఇచ్చిన బోగొట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది శ్రీ అంబవరపు సుధాకర్ రెడ్డి తండ్రి బలరామిరెడ్డి, పొదలకూరు గ్రామం & మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా గారికి సంబంధించిన ఈ క్రింది షెడ్యూలులో చూపిన స్థిరాస్తిని రిజిస్టరు తనఖా చేయించుకొని ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకొన్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూలు స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి ఋణాలు, ఛార్జీలు క్లెయిములు, తనఖాలు, అగ్రిమెంట్, కోర్టు వివాద ములు తదితర అభ్యంతరములు ఉన్న యెడల నేటి నుండి 7 దినములలో ఈ క్రింది చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియ జేయగలరు. తదుపరి అభ్యంతరములకు నా క్లయింట్ బాధ్యులు కారు.

SCHEDULE

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు రి.డి. ఋలాకా కోవూరు స.రి.లో చేరిన విడవలూరు మండలం విడవలూరు పంచాయితీ విడవలూరు గ్రామంలో పైన పేర్కొన్న విధముగా నాకు సంపూర్ణ హక్కు స్వాధీనానుభవములు కలిగియుండి ఈ దినమున నీకు నేను విక్రయించిన సర్వే నెం.446 రులోని అనగా 5వ వార్డు, కామాక్షినగర్‌లో డోర్ నెం.5-94 రు సమీపమున అసెస్‌మెంట్ నెం. 725/931రులో లోగా శిథిలావస్థలో ఇల్లు వుండి సదరు ఇల్లు తీసివేయగా ఏర్పడిన ఖాళీ స్థలములకు హద్దులు:- తూర్పు: తుమ్మూరు శ్రీనివాసులు గారి స్థలం, దక్షిణం: మెయిన్ రోడ్డు, పడమర: వీధి, ఉత్తరం:వీధి. ఈ హద్దులలోని 20 అంకణములు లేక 160 చ.గ. లేక 133.80 చ.మీ. ఖాళీ స్థలమున్నూ ఈ స్థలమునకు గల మామూలు రాకపోకలు వగైరా యావత్తు ఈజ్‌మెంటు హక్కులతో సహా.

Perepi Venugopal, B.Com., B.L., Advocate, Tekkemitta, Nellore. Cell: 8374259528

జనరల్ నోటీసు

నా క్లయింట్ అయిన నెల్లూరు నగరం, కట్టెంపూడి వారి వీధి, సంతపేట కాపురస్తుడు శ్రీ దోసిపూడి వెంకటేశ్వర్లు కుమారుడు దోసిపూడి కోటేశ్వరరావు గారి తరఫున తెలియజేయు ప్రకటన అంశములు ఏమనగా ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని నెల్లూరు నగరం, నేతాజీనగర్, తిప్ప, ఇం.నెం.25-3-815రు, కాపురస్తుడు లేట్ తేనిపూడి కేశవులు గారి కుమారుడు తేనిపూడి కేశవనారాయణమూర్తి గారి వద్ద కొనుగోలు చేయుటకు నిర్ణయించుకొని, వారి వద్ద విక్రయ అగ్రిమెంటు చేసుకొనుటకు సిద్ధముగా వున్నారు. కావున దిగువ షెడ్యూలు దాఖల ఆస్తిపై ఎవరికి అయినా ఎటువంటి ఆక్షేపణలు ఉన్న యెడల ఈరోజు నుండి 7 (ఏడు) రోజుల లోపల ఈ క్రింది అడ్రస్సుకు లిఖితపూర్వముగా సరియగు ఆధారాలతో తెలుపుకోవలసినది. తదుపరి వచ్చు ఆక్షేపణలు నా క్లయింటుకు బద్ధగించవు.

షెడ్యూలు

నెల్లూరు రి.డి. ఋలాకా, నెల్లూరు స.రి.లో చేరిన, నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని నెల్లూరు బిట్-1, సర్వే నెం.1954రు యం 9.81 సెంట్లలో సంజయగాంధీనగర్ ఏరియా, 1వ వీధిలో వార్డు నెం.21/1, డోరు నెం.2003 సమీపంలోని 18 అంకణములు లేక 144 చ.గ. ఖాళీ స్థలమునకు **హద్దులు తూర్పు:** పెళ్ళూరు ధనయ్య గారి స్థలం, **దక్షిణం:** యంసుబ్బులక్ష్మమ్మ గారి స్థలం, **పడమర:** కొట్టే హృదయరాజు గారి యిల్లు కొంత వరకు యితరుల ఇల్లు కొంతవరకు, **ఉత్తరం:** రోడ్. యీ హద్దులలోని 18 అంకణములు లేక 144 చ.గ. స్థలమున్నూ యిందుకు సంబంధించిన యావత్ యాజ్‌మెంట్ హక్కులతోటి.

Sk.Anwar Basha, B.Com., L.L.B., Advocate, 18-2-66, Yaseen Street, Opp:SBI, Achari Street, Nellore-524001. Cell:9441960661

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింట్ M/s. Shriram Finance Ltd., Nellore-3 బ్రాంచి మేనేజర్ వారు ఇచ్చిన బోగొట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది శ్రీమతి దబ్బుగుంట నాగమణి భర్త వెంకట సుబ్బయ్య, కోనేటిమిట్ట, మూలాపేట, నెల్లూరు సిటీ గారికి సంబంధించిన ఈ క్రింది షెడ్యూలులో చూపిన స్థిరాస్తులను రిజిస్టరు తనఖా చేయించుకొని శ్రీ దబ్బుగుంట వెంకట సుబ్బయ్య తండ్రి లేట్ వెంకయ్య గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకొన్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూలు స్థిరాస్తులపై ఎవరికైననూ ఎటువంటి ఋణాలు, ఛార్జీలు క్లెయిములు, తనఖాలు, అగ్రిమెంట్, కోర్టు వివాద ములు తదితర అభ్యంతరములు ఉన్న యెడల నేటి నుండి 7 దినములలో ఈ క్రింది చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియ జేయగలరు. తదుపరి అభ్యంతరములకు నా క్లయింట్ బాధ్యులు కారు.

SCHEDULE

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, గూడూరు డి.రి. ఋలాకా ప్రస్తుతం నెల్లూరు డి.రి. ఋలాకా ముత్తుకూరు స.రిలో చేరిన నెల్లూరు రూరల్ మండలంలోని కాకుపల్లి బిట్-1 గ్రామ పంచాయితిలోని కాకుపల్లి బిట్-1 రెవిన్యూ గ్రామములో (ధనలక్ష్మీపురం దగ్గర) నెం.173 రు పట్టా దాఖలా కోరు మెట్ట సర్వే నెం.27/1 రులో య.6.98ట్లలో య.6.98ట్లున్నూ, నెం.173రు పట్టా దాఖలా కోరు మెట్ట సర్వే నెం.27/2రులో య.3.79ట్లలో య.3.79ట్లున్నూ వెరశి య.10.77ట్ల భూమిని భౌగోళిక దిక్కుల ప్రకారం (అనగా దిక్సూచి ప్రకారం) ఇండ్ల నివేశన స్థలములుగా విభజించి, కాకుపల్లి బిట్-1 గ్రామ పంచాయితీ వారి తీర్మానం నెం.8రు, తే.24.10.1990దిగా అప్రూవ్ కాబడిన "JASMINE GARDENS LAYOUT" లే-అవుట్ ప్లాను దాఖలా ప్లాట్లులో నుండి నీకు సెటిల్‌మెంటు చేసినది.

అయిటం నెం.1:- నెం.63రు ప్లాటు విస్తీర్ణము 29 అంకణములు లేక 232 చదరపు గజములు ఖాళీ స్థలమునకు హద్దులు:- తూర్పు: నెం.69రు ప్లాటు, దక్షిణం: నెం.64 రు ప్లాటు, పడమర: 30 అడుగుల వెడల్పు కలిగిన లే అవుట్ రోడ్డు, ఉత్తరం: నెం.62రు ప్లాటు. ఈ హద్దులలోని 29 అంకణములు లేక 232 చదరపు గజములు ఖాళీ స్థలమున్నూ

అయిటం నెం.2:- నెం.64రు ప్లాటు విస్తీర్ణము 25.50 అంకణములు లేక 204 చదరపు గజములు ఖాళీ స్థలమునకు హద్దులు:- తూర్పు: నెం.68రు ప్లాటు, దక్షిణం: నెం.67 రు ప్లాటు, పడమర: పంచాయితి ప్రహరి గోడ, ఉత్తరం: నెం.63రు ప్లాటు. ఈ హద్దులలోని 25.50 అంకణములు లేక 204 చదరపు గజములు ఖాళీ స్థలమున్నూ

అయిటం నెం.3:- నెం.65రు ప్లాటు విస్తీర్ణము 7.83 అంకణములు లేక 62.64 చదరపు గజములు ఖాళీ స్థలమునకు హద్దులు:- తూర్పు: 30 అడుగుల వెడల్పు కలిగిన లే అవుట్ రోడ్డు, దక్షిణం: పంచాయితి ప్రహరి గోడ, పడమర: పంచాయితి ప్రహరి గోడ, ఉత్తరం: నెం.66రు ప్లాటు. ఈ హద్దులలోని 7.83 అంకణములు లేక 62.64 చదరపు గజములు ఖాళీ స్థలమున్నూ

అయిటం నెం.4:- నెం.66 రు ప్లాటు విస్తీర్ణము 37.85 అంకణములు లేక 302.80 చదరపు గజములు ఖాళీ స్థలమునకు హద్దులు:- తూర్పు: 30 అడుగుల వెడల్పు కలిగిన లే అవుట్ రోడ్డు, దక్షిణం: నెం.65 రు ప్లాటు, పడమర: పంచాయితి ప్రహరి గోడ, ఉత్తరం: నెం.67రు ప్లాటు. ఈ హద్దులలోని 37.85 అంకణములు లేక 302.80 చదరపు గజములు ఖాళీ స్థలమున్నూ

అయిటం నెం.5:- నెం.67 రు ప్లాటు విస్తీర్ణము 48.61 అంకణములు లేక 388.88 చదరపు గజములు ఖాళీ స్థలమునకు హద్దులు:- తూర్పు: 30 అడుగుల వెడల్పు కలిగిన లే అవుట్ రోడ్డు, దక్షిణం: నెం.66రు ప్లాటు, పడమర: పంచాయితి ప్రహరి గోడ, ఉత్తరం: నెం.64, 68ర్లు ప్లాట్లు. ఈ హద్దులలోని 48.61 అంకణములు లేక 388.88 చదరపు గజములు ఖాళీ స్థలమున్నూ, పై అయిదు అయిటములు ప్లాట్లు వెరశి 148.79 అంకణములు లేక 1190.32 చదరపు గజములు ఖాళీ స్థలమున్నూ, సదరు స్థలమునకు సంబంధించిన మామూలు దారులు, వగైరా సర్వహక్కుల యావత్తు యాజ్‌మెంట్ రైట్లు తోటి.

Perepi Venugopal, B.Com., B.L., Advocate, Tekkemitta, Nellore. Cell: 8374259528

కామాక్షితాయి సేవలో వేమిరెడ్డి దంపతులు

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 24: నెల్లూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు, పోలంరెడ్డి దినేష్‌రెడ్డి ఆదివారం జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయిని దర్శించుకున్నారు. అర్చకులు, వారిని స్వాగతించి ప్రత్యేక పూజలుచేసి తీర్థ ప్ర సాదాలు, స్వామి, అమ్మవార్ల శేష వస్త్రాలు అందజేశారు. ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో తమకు విజయం చేకూర్చాలని కోరుతూ పూజలు చేసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జొన్నవాడ సర్పంచు పెంచలయ్య, ఎంవీ శేషయ్య, హరికృష్ణ, గోవర్దన్‌రెడ్డి, సూరా శ్రీనివాసులురెడ్డి, సుబ్రమణ్యంనాయుడు, వేణుగోపాల్‌రెడ్డి, హరనాథ్, రామానాయుడు, చైతన్య, వుసురుపాటి, మురళి, జీఎస్ఆర్, నందకుమార్, ఉమ్మయ్య, నరసింహ, సుధాకర్ పురుషోత్తం, స్నేహలత, నాగరాజు, నరసయ్య, శంకర్, మండలంలోని నాయకులు పాల్గొన్నారు.



కామాక్షితాయికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న వేమిరెడ్డి దంపతులు

చాముండేశ్వరీదేవికి ప్రత్యేక పూజలు

ఇందుకూరుపేట: మండలంలోని గంగపట్నంలో శ్రీచాముండేశ్వరి అమ్మవారిని ప్రశాంతిరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీజాతీయ అధికార ప్రతినిధి పోలం రెడ్డి దినేష్ రెడ్డి, మండల కన్వీనర్ వీరేంద్రచౌదరి, పొన్నబోయిన చెంచుకిషోర్‌యాదవ్, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వేమిరెడ్డి దంపతులపై విమర్శలు తగదు

వేమిరెడ్డి దంపతులపై వ్యక్తిగత విమర్శలు చేయడం కోవూరు శాసనసభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి తగదని నెల్లూరుజిల్లా పవన్‌కల్యాణ్ ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షుడు గుడి హరికుమార్‌రెడ్డి హితవు పలికారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని రంగాలలో మహిళలు ముందంజలో ఉన్నారని, వారిని గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సమావేశంలో మోహన్‌రెడ్డి, లక్ష్మయ్య, మారుతి, సుమన్, వెంకయ్య, మణి, జనసైనికులు, తదితరులు పాల్గొన్నారు.

వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గెలుపు తథ్యం : చెక్క

కొడవలూరు: వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గెలుపు తథ్యమని జిల్లా టీడీపీ పార్లమెంట్ సెక్రటరీ చెక్క మదన్ అన్నారు. ఆదివారం నెల్లూరు నగరంలో వేమిరెడ్డి ప్రశాంతి నివాసంలో ఆమెను మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందచేశారు. అనంతరం కొత్తవంగల్లు 8వార్డు మెంబరు జి బ్రహ్మయ్య, 4వార్డు మెంబరు ఎం మల్లికార్జునలను చెక్క మదన్ ఆధ్వర్యంలో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. ఈసందర్భంగా చెక్క మదన్ మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. నియోజకవర్గంలో మాఫియాను అడ్డుకోవాలంటే ప్రశాంతిరెడ్డి గెలుపుతోనే సాధ్యమని, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి జరుగుతుందన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు తదితరులున్నారు.

సర్వేపల్లిలో ఎగిరేది టీడీపీ జెండానే : సోమిరెడ్డి

ముత్తుకూరు, మార్చి 24: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సర్వే పల్లిలో ఎగిరేది టీడీపీ జెండానేనని మాజీ మంత్రి, టీడీపీ జాతీయ పొ లిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం కృష్ణపట్నం పంచాయతీ ఆర్కాట్‌పాలెంకి చెందిన 18 కుటుంబాలు, నేలటూరుపాలెం నుంచి 30 కుటుంబాలు, నారికేళపల్లి నుంచి 18 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. వారికి సోమిరెడ్డి కండువాలు కప్పి టీడీపీ లోకి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో కాకాణి గోవర్ధన్‌రెడ్డి అవినీతి, అక్రమాలు, దందాలతో ప్రజలు విసిగి పోయారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సర్వేపల్లి నియోజకవర్గం సమన్వయకర్త సోమిరెడ్డి రాజ గోపాల్‌రెడ్డి, బొమ్మి సురేంద్ర, పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, ఈపూరు మునిరెడ్డి, నాయకులు ఏకొల్లు కోదండయ్య, తదితరులు పాల్గొన్నారు.



తోటపల్లిగూడూరు : టీడీపీలో చేరిన వరిగొండ గ్రామస్థులు

గిరిజన పొలాల ధ్వంసం దుర్మార్గం

తోటపల్లిగూడూరు: గిరిజన కుటుంబాల 120 ఎకరాల భూమిని మంత్రి కాకాణి అండదండలతో ధ్వంసం చేయడం దుర్మార్గమని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మల్లి కార్జునపురం గ్రామంలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరకవిపూడి చెరువులో గిరిజనులు సాగు చేస్తున్న భూమిని వైసీపీ ప్రభుత్వం ధ్వంసం చేయడం దుర్మార్గానికి పరాకాష్ట అని, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే పొలాలు కోల్పోయిన వారికి ఇప్పించే బాధ్యత నాదని సోమిరెడ్డి గిరిజనులకు భరోసా ఇచ్చారు. మల్లికార్జునపురం గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, సోమిరెడ్డి శృతి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, మండల అధ్యక్షుడు సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, స్థానిక నాయకులు తాళ్లూరు జీవరత్నం, మహేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి భారీ చేరికలు

మండలంలోని వరిగొండ గ్రామానికి చెందిన సుమారు 80 కుటుంబాలు ఆదివారం వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. వేదాయపాలెంలో సోమిరెడ్డి పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కొత్తపాలెం మాజీ సర్పంచ్ చేవూరు శ్రీనివాసులు, ఉప సర్పంచ్ శ్రీరామ్‌శ్రీహరి, యువత సోమిరెడ్డిని కలిసి అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, మండల అధ్యక్షుడు సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, వరిగొండ సీనియర్ నాయకులు చినబాబురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సోమిరెడ్డి గెలుపునకు కృషి చేయండి

మనుబోలు: ఈ ఎన్నికల్లో సర్వేపల్లి టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గెలుపుకోసం నాయకులు, కార్యకర్తలు గట్టిగా కృషి చేయాలని సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కోరారు. ఆయన మండలంలోని కొలనుకుదురు. పిడూరుపాళెం గ్రామాల్లో ఆదివారం పర్యటించారు. పిడూరుపాళెంకు చెందిన వైసీపీ నాయకులు చిట్టమూరు వేణుగోపాల్‌రెడ్డి కుటుంబం టీడీపీ తీర్థం పుచ్చు కున్నారు. ఆయనకు పార్టీ కండువా కప్పి స్వాగ తించారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డి, పొన్నూరు రామకృష్ణయ్య, గాలి వెంకటసుబ్బారెడ్డి, పలగాని బాబులు రెడ్డి, నిఖిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణ వేంకటేశ్వరుడి విగ్రహ ప్రతిష్ఠ

ముత్తుకూరు, మార్చి 24: కప్పల దొరువులోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం కల్యాణ వెంకటేశ్వర స్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణ వ్యవస్థాపకులు వేణుంబాక వెంకటశేషారెడ్డి, శారదల స్మృత్యర్థం నూతన ఆలయాన్ని నిర్మించి మూడు రోజులు పాటు ఉత్సవాలు నిర్వహించారు. ఆదివారం జీవధ్వజ ప్రతిష్ఠ, కుంబాభిషేక మహోత్సవం జరిపారు. హోమాల అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య వెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు పల్లంరెడ్డి రామ్మో హన్ రెడ్డి, నాయకులు సురేష్‌రెడ్డి, కోదండయ్య, రమేష్‌శర్మ, శ్రీనివాసులు పాల్గొన్నారు. వేడుకల్లో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, గొలగమూడి ఆశ్రమ కమిటీ సభ్యులు ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

వెంకటాచలంలో కాకాణి ఎన్నికల ప్రచారం

వెంకటాచలం, మార్చి 24 : వెంకటాచలంలో ఆదివారం సాయంత్రం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సుబ్రహ్మణ్యం, నాయకులు ఎం వెంకటశేషయ్య, ఎం పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవు

పొదలకూరు, మార్చి 24: సర్వేపల్లి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి చినఓబులేసు ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ మద్యం దుకాణాలు, కల్యాణ మండపాలు, కుదువ వ్యాపారుల దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారమే మద్యం విక్రయించాలని మద్యం దుకాణాల నిర్వాహకులకు సూచించారు. రాజకీయాలకు సంబంధించిన కార్యక్రమాలకు అధికారుల అనుమతి తప్పనిసరిగా పొందాలని కల్యాణ మండపాల నిర్వాహకులకు సూచించారు. కుదువ వ్యాపారస్తులు తప్పనిసరిగా రికార్డులు నమోదు చేయాలని కోరారు. ఎన్నికల నిబంధనలు పాటించకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవంటూ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు వీర వసంత రావు, వీఆర్‌వోలు పాల్గొన్నారు.



కుదువ దుకాణాలను పరిశీలిస్తున్న ఆర్‌వో

ఆరోగ్య సిబ్బందికి పురస్కారాలు

పొదలకూరు, మార్చి 24: క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేసినందుకు ఆరోగ్య ఉపకేంద్రం ఆరోగ్య సహాయకురాలు ఎం రాధాకుమారికి, ఎమ్మార్వో కాలనీ ఆశా కార్యకర్త జి సీతకు ప్రతిభా పురస్కారం లభించింది. ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలనా దినోత్సవం సందర్భంగా జిల్లా అదనపు వైద్యాధికారి, జిల్లా టీబీ, లెప్రసీ అండ్ ఎయిడ్స్ వ్యాధి నివారణాధికారి డాక్టర్ ఖాదర్‌వలి చేతుల మీదుగా ఆదివారం వారు ప్రతిభా పురస్కారాలు అందుకున్నారు. ఈ సందర్భంగా మహమ్మదాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ నరసింహారావు, డాక్టర్ కిరణ్ రిషిత, సిబ్బంది అభినందనలు తెలిపారు.

ప్రేక్షకులు మెచ్చిన చిత్రం



కావలి	-	శ్రవంతి
కందుకూరు	-	యువరాజు
విడవలూరు	-	జనార్ధన్ మహల్
గూడూరు	-	సప్తగిరి శ్రీనివాస
లింగసముద్రం	-	విజయలక్ష్మి

CONTACT 8374991228

కేంద్రంలో మోదీ... రాష్ట్రంలో బాబు ఖాయం

● వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



పరిచయ కార్యక్రమంలో కూటమి అభ్యర్థులు, బీజేపీ నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 24: ఎన్‌డీఏ పక్షాన రాష్ట్రంలో సీఎంగా నారా చంద్రబాబు నాయుడు, కేంద్రంలో పీఎంగా నరేంద్ర మోదీగా ప్రమాణ స్వీకారం చేస్తారని రాజ్యసభ సభ్యుడు, టీడీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. నగరంలోని వేదాయపాళెం ఎంవీఎస్ కల్యాణ మండపంలో బీజేపీ బూత్ స్థాయి కమిటీ క్యాకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఇందులో వేమిరెడ్డి, రూరల్ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని బీజేపీ కార్యకర్తలకు పరిచయం చేశారు. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో, కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వాలు రానుండటం జిల్లా అభివృద్ధికి ఎంతో దోహద పడుతుందన్నారు. శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ అందరం కలిసి కట్టుగా టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణరెడ్డి, నాయకులు పీ సురేంద్రరెడ్డి, సీపా వంశీధర్‌రెడ్డి, మెగరాల సురేష్, కే రాజేశ్వరమ్మ, భరత్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో యువత చేరిక

నెల్లూరు(వైద్యం) మార్చి 24 : మాజీ మంత్రి, టీడీపీ సిటీ అభ్యర్థి పొంగూరు నారాయణ, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో 13వ డివిజన్‌కు చెందిన పలువురు యువత టీడీపీలో చేరారు. ఆదివారం నగరంలోని గోమతి నగర్ నారాయణ క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. నారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనను అంతమొందించాలన్న ఉద్దేశంతో యువత పార్టీలో చేరుతున్నారని చెప్పారు. ఏటా జాబ్ క్యాలెండర్ అని చెప్పి ప్రభుత్వం యువతను మోసం చేసిందని ఆరోపించారు. ఎంపీగా వేమిరెడ్డిని, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, పార్టీ నగర అధ్యక్షుడు మామిడాల మధు, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్, టీడీపీ నేతలు పాల్గొన్నారు.



యువతను పార్టీలోకి ఆహ్వానిస్తున్న నారాయణ, వేమిరెడ్డి

రూరల్‌లో...

నెల్లూరు(వ్యవసాయం): నెల్లూరు రూరల్ నియోజకవర్గ నుంచి తెలుగుదేశం పార్టీలో ఆదివారం పలు ప్రాంతాలకు చెందిన నాయకులు చేరారు. 23వ డివిజన్ సప్తగిరి లేఅవుట్‌కు చెందిన చిట్టమూరు మమతారెడ్డి వారి మిత్ర బృందం రూరల్ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. మాదరాజుగూడూరు గ్రామం వడ్డిపాళెంకు చెందిన సత్యనారాయణ, వార్డు మెంబరు బెల్లంకొండ అంకయ్య, నెల్లూరు అంజికుమార్ వారి మిత్రబృందం కూడా పార్టీలో చేరింది. 24వ డివిజన్ కనుపర్తిపాడుకు చెందిన నెల్లూరు కిషోర్, నెల్లూరు బెనర్జీ, వారి మిత్ర బృందం, 30వ డివిజన్ తిరుమలనగర్, కొత్తూరుకు చెందిన తురకా వెంకటేశ్వర్లు, చింతా దుర్గా ప్రసాద్ వారి మిత్ర బృందం పార్టీలో చేరారు. కాగా, రూరల్ కార్యాలయంలో శ్రీధర్‌రెడ్డి 33, 35, 36, 38 డివిజన్ల యువతతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

విజయసాయి విమర్శలు హాస్యాస్పదం?

● పొంగూరు నారాయణ

నెల్లూరు(వైద్యం), మార్చి 24 : నెల్లూరు నగరం లో నేను చేసిన అభివృద్ధిపై వైసీపీ ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి చేసిన విమర్శలు హాస్యాస్పదంగా ఉన్నాయని మాజీ మంత్రి, టీడీపీ నేత పొంగూరు నారాయణ ఎద్దేవా చేశారు. ఆదివారం 9, 10వ డివి జన్లలో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో నారాయణ మాట్లాడారు. నగరంలో వైసీపీ వల్లే అభివృద్ధి జరిగిందని, తన హయాంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని విజయ సాయిరెడ్డి చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, మంచినీటి ప్రాజెక్టు టీడీపీ అధికారంలోకి వస్తే పూర్తవుతాయని, ఇవి తన కోసమే ఎత్తి పెట్టారన్నారు. ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కాగా, నారాయణ సతీమణి రమాదేవి 16వ డివిజన్ ఆదిత్యానగర్, బాలసుబ్రహ్మణ్యం పార్క్, బాలాజీనగర్ ప్రాంతాలలో ప్రచారం చేశారు. నగరంలో రోడ్లు బాగున్నాయంటే అది నారాయణ చేసిన అభివృద్ధే అన్నారు. 2019 ఎన్నికల్లో తప్పు చేశామని, ఈసారి ఆ తప్పు చేయమని.. నారాయణను గెలిపించుకుంటామని స్థానికులు చెబుతుండటం సంతోషంగా ఉందన్నారు.

టీడీపీతోనే రాజకీయ ప్రయాణం : కేఎన్ఆర్

నెల్లూరు రూరల్ : టీడీపీతో ఆరంభమైన తన రాజకీయ ప్రస్థానం ఆ పార్టీతోనే కొనసాగుతుందని నెల్లూరు రూరల్ నియోజకవర్గం 12వ డివిజన్ ధనలక్ష్మీపురానికి చెందిన కుడుముల నాగేశ్వరరావు గౌడ్ తెలిపారు. తల్లిలాంటి టీడీపీకి తిరిగి రావడం సంతోషంగా ఉందన్నారు. కాకుపల్లి, మాదరాజుగూడూరు, గుండ్లపాళెం, వావిలేటిపాడులోని తన బలాన్ని పోగుచేసి టీడీపీకి మెజార్టీ తెస్తానని ప్రకటించారు.

ప్రసన్నా.. పద్ధతి మార్చుకో!

● టీడీపీ రూరల్ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఫైర్

నెల్లూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : కోవూరు టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల్లో ఉపయోగించిన భాష తీవ్ర అభ్యంతరకర మని, తాము కూడా అదే భాషలో సమాధానమిస్తే ప్రసన్న తలెక్కడ పెట్టుకుంటారని టీడీపీ రూరల్ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మండిపడ్డారు. ఆదివారం నెల్లూరులోని తన కార్యాల యంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఓటమి భయంతో ప్రసన్న కుమార్‌రెడ్డి నోటికొచ్చిన ట్లు మాట్లాడుతున్నారని, ఆయన పద్ధతి మార్చుకోవాలని హితవుపలికారు. ప్రసన్నకుమార్‌రెడ్డి నెల రోజుల ముందు యాగానికి పిలిచి వేమిరెడ్డి దంపతులను ఆది దంపతులు అని కీర్తించారని గుర్తు చేశారు. విజయసాయిరెడ్డికి ధైర్యం ఉంటే రాజ్యసభ సభ్యత్వానికి రాజీనా మా చేసి నెల్లూరులో ఎంపీగా పోటీ చేయాలని కోటంరెడ్డి సవాల్ విసిరారు. గెలుస్తామన్న నమ్మకం లేకే విజయసాయిరెడ్డి కేంద్రంతో మాట్లాడుకుంటున్నారని విమర్శించారు.



మాట్లాడుతున్న కోటంరెడ్డి

నీ చరిత్రను వీధిలో పెడతాం : రూప్‌కుమార్

నెల్లూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : తాము మాట్లాడటం మొదలుపెడితే ప్రసన్నకుమార్‌రెడ్డి చరిత్రను వీధిలో పెడతామని నెల్లూరు డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ హెచ్చరించారు. ఆదివారం నగరంలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కొండపల్లి గురవయ్య దగ్గర నుంచి మాట్లాడడం మొదలుపెడితే ప్రసన్న కుమార్‌రెడ్డి తట్టుకోలేరన్నారు. నిన్న మొన్నటి వరకు వేమిరెడ్డి ఇంటికి వచ్చి వాళ్ల కాళ్ల దగ్గర తిరిగిన విషయం ప్రసన్నకుమార్‌రెడ్డి మరిచిపోయారా అని ధ్వజ మెత్తారు. వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిని నోటికొచ్చినట్లు ప్రసన్న మాట్లాడడం దురదృష్టకరమన్నారు. కుల దైవం కోటమ్మ గుడిలో తనకు అన్నదమ్ములు లేరని పిండ ప్రదానం చేసిన చరిత్ర ప్రసన్నదంటూ తీవ్రస్థాయిలో విరుచు కుపడ్డారు. ఇది విశాఖ కాదు.. నెల్లూరు అన్న విషయా న్ని విజయసాయిరెడ్డి గుర్తుంచుకోవాలని హితవుపలికారు. విజయసాయిరెడ్డికి నెల్లూరు ఓటు కూడా లేదని, విశాఖపట్నంలోని సీతమ్మ ధారలో ఉందని ఆధారాలు చూపించారు. విజయ సాయిరెడ్డి అల్లుడు అరబిందో కంపెనీల పేరుతో విశాఖలోని పోర్టు నుంచి ఏం చేస్తున్నారో అందరికీ తెలుసునని ఆరోపించారు. సొంత డబ్బుతో ధార్మిక కార్యక్రమాలు చేస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి, విజయసాయిరెడ్డికి అసలు పోలికే లేదన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రూప్‌కుమార్

కాంగ్రెస్ అకౌంట్ సీజ్ దారుణం

● డాక్టర్ పల్లంరెడ్డి యశోధర

నెల్లూరు(వైద్యం), మార్చి 24 : కేంద్ర ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీకి చెందిన బ్యాంక్ అకౌంట్‌ను సీజ్ చేయటం దారుణమని శ్రీదుర్గ ఆసుపత్రి అధినేత, కాంగ్రెస్ పార్టీ నాయకురాలు డాక్టర్ పల్లంరెడ్డి యశోధర విమర్శించారు. ఆదివారం ఆసుపత్రిలో ఆమె విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా తాను రూ.10 లక్షలు పార్టీ అకౌంట్‌లో వేశానన్నారు. బీజేపీ అమానుష ధోరణి పోవాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. చైనా చొరబాటును వ్యతిరేకిస్తూ, పర్యావరణం కోసం నిరాహార దీక్ష చేస్తున్న సోనం చర్‌్‌కు మద్దతు పలకాలని పిలుపునిచ్చారు.

చంద్రబాబుకు ధన్యవాదాలు : దినేష్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 24: తెలుగుదేశం పార్టీ జాతీయ అధికార ప్రతినిధిగా బాధ్యతలు ఇచ్చిన పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలుపుతున్నానని పోలంరెడ్డి దినేష్‌రెడ్డి తెలిపారు. టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. అన్నపూర్ణగా ఉన్న ఆంధ్రప్రదేశ్ నేడు అంధకార ఆంధ్రప్రదేశ్‌గా మారిపోయిందన్నారు. దేశానికి తలమానికంగా నిలిచిన రాష్ట్రం నేడు అప్పులమయం అయ్యిందని, మాఫియా అడ్డాగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మళ్లీ వెలుగులు నిండాలంటే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలన్నారు.

ధర్మనిరతికి నలచక్రవర్తి ఆదర్శం


నెల్లూరు (సాంస్కృతికం): ధర్మనిరతికి ఆదర్శప్రాయుడైన నల చక్రవర్తి చరిత్రను ప్రతి ఒక్కరు చదవాలి, వినాలని సహస్ర శత అవధాని డాక్టర్ సూరం శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం పురమందిరం ఏసీ హాలులో బ్రహ్మశ్రీ పోలూరి హనుమజ్జానకీ రామ శర్మ శత జయంతి ఆధ్యాత్మిక ప్రవచనాలలో ఆయన నలచరిత్రపై ప్రవచనం చేశారు. నలచరిత్ర మహా భారతంలోని వన పర్వంలో ఉందని తెలిపారు. అనంతరం శ్రీరామావతార వైభవం గ్రంథ ఆవిష్కరణ జరిగింది. పద్య కళాపరిషత్ అధ్యక్షుడు ఎం రామచంద్రప్రసాద్, కార్యదర్శి చీమకుర్తి వెంకటేశ్వర్లు, కోశాధికారి నలుబోలు బలరామయ్య నాయుడు, వేదం రాధాకృష్ణమూర్తి, పాల్గొన్నారు.

పార్కులో పచ్చదనం - పరిశుభ్రత

నగరంలోని మహాత్మాగాంధీనగర్ పార్కులో ఆదివారం పచ్చదనం - పరిశుభ్రత కార్యక్రమాన్ని మహాత్మాగాంధీనగర్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు నిర్వహించారు. పార్కులోని చెత్తాచెదారాలను తొలగించి శుభ్రం చేశారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు మాదాల వెంకటేశ్వర్లు, అధ్యక్షుడు ఎంఎల్ఎన్ యాదవ్, కోశాధికారి విజయకుమార్, ఉపాధ్యక్షుడు టీఎస్‌టీ బాబు పాల్గొన్నారు.

మధుసూదన్‌రెడ్డికి డాక్టరేట్

నెల్లూరు (విద్య), మార్చి 24 : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని ఎడ్యుకేషన్ విభాగం పరిశోధక విద్యార్థి గాజులపల్లె మధుసూదన్‌రెడ్డికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి దామ్లా నాయక్ ప్రకటించారు. నెల్లూరులోని సిద్ధార్థ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న మధుసూదన్‌రెడ్డి ఎస్వీయూలోని ఎడ్యుకేషన్ విభాగం విశ్రాంత అధ్యాపకుడు ఆచార్య వీ దయాకర్‌రెడ్డి పర్యవేక్షణలో ఇన్‌ఫ్లుయన్స్ ఆఫ్ అడ్జస్ట్‌మెంట్ ప్రాబ్లమ్స్ ఆన్ ది అచీవ్‌మెంట్ ఆఫ్ ఎస్‌సీ స్టూడెంట్స్ ఇన్ రెసిడెన్షియల్ అండ్ నాన్ రెసిడెన్షియల్ స్కూల్స్ అనే అంశంపై చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ లభించింది. ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.



మధుసూదన్‌రెడ్డి

ఏసీ స్టేడియంలో వైద్య శిబిరం

నెల్లూరు (విద్య), మార్చి 24 : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వాకర్స్‌కు వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ మారం సుధాకర్ మాట్లాడుతూ ఆధునిక యుగంలో ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆహార నియమాలు పాటించడంతోపాటు అలవాట్లలో కూడా మార్పులు రావాలన్నారు. అనంతరం వాకర్స్ సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బిరదవోలు రామ్మోహన్‌రెడ్డి, కార్యదర్శి షేక్ నసీర్ అహ్మద్, కోశాధికారి సుబ్బరాయుడు, వాకర్స్ ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ నలుబోలు బలరామయ్యనాయుడు, సభ్యులు పాల్గొన్నారు.

విశాఖను డ్రగ్స్ రాజధానిగా మార్చిన వైసీపీ

● టీడీపీ నగర అధ్యక్షుడు మధు

నెల్లూరు (వెంకటేశ్వరపురం): విశాఖను స్టేట్ క్యాపిటల్‌గా మారుస్తామని చెప్పిన జగన్ డ్రగ్స్ క్యాపిటల్‌గా మార్చారని టీడీపీ నెల్లూరు నగర అధ్యక్షుడు మామిడాల మధు విమర్శించారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో పలువురు పార్టీ నాయకులతో కలసి ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. విశాఖలో పట్టుబడిన డ్రగ్స్‌కి వైసీపీ నాయకులకు సంబంధం ఉన్న ట్లు తేలిందన్నారు. బ్రెజిల్ దేశ అధ్యక్షుడికి విజయ సాయిరెడ్డి ఎందుకు ట్వీట్ చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. డ్రగ్స్ తెప్పించిన కంపెనీ యజమాని వైసీపీకి చెందిన వ్యక్తిగా తేలిందన్నారు. ఈ సమావేశంలో నాయకులు రేవతి, ప్రవీణ్, వేణు, గోవర్ధన్, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారావు కుటుంబానిది హత్యే!

నెల్లూరు(వ్యవసాయం), మార్చి 24 : కడప జిల్లా ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరంలో జరిగిన పాల సుబ్బారావు, పద్మావతి, వినయ కుటుంబ సభ్యులది ఆత్మహత్య కాదని రాజకీయ నాయకులు, అధికారులు చేసిన హత్యని జిల్లా చేనేత నాయకులు ఆశం సురేష్, ఎర్ర ధనుంజయ, తాళ్ల నరసింహస్వామి, తాళ్ల నరసింహస్వామి, బ్రహ్మయ్య, మల్లికార్జునరావు ఓ ప్రకటనలో విమర్శించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత చేనేతలపై ఇలాంటి బాధాకరమైన సంఘటనలు ఎన్నో జరిగాయని, వీటికి ఏం సమాధానం చెబుతారంటూ ముఖ్యమంత్రి జగన్‌ను ప్రశ్నించారు.

పెన్షనర్లు ఆఖరి పోరాటానికి సిద్ధం కావాలి

నెల్లూరు (సాంస్కృతికం): పెన్షనర్లు పన్ను పోటు నుంచి రక్షణ కోసం ఆఖరి పోరాటానికి సిద్ధం కావాలని విశ్రాంత సోషల్ వెల్ఫేర్ శాఖాధికారి ఎస్‌కే ఖాసిం ప్రకటనలో పిలుపునిచ్చారు. పన్ను పోటు నుంచి బయటపడేందుకు పార్లమెంటు సభ్యులపై ఒత్తిడి తీసుకు రావాలని, అందుకు పెన్షనర్స్ సంఘాలన్నీ ఏకం కావాలని కోరారు.

నేడు అయ్యప్ప జయంతి

నెల్లూరు (సాంస్కృతికం): నగరంలోని అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప జయంతి వేడుకలు, శ్రీగురువాయురప్పన్ మహావిష్ణు ఆలయంలో మహాలక్ష్మీ జయంతి వేడుకలు సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ జీ శేషగిరిరావు, కార్యదర్శి కత్తుల వెంకటరత్నం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అయ్యప్ప జయంతి సందర్భంగా ఉదయం 10గంటలకు స్వామి వారికి విశేష తిరుమంజనం, ఉచ్ఛ పూజ జరుగుతాయని తెలిపారు. మహాలక్ష్మీకి ఉదయం 8గంటలకు తిరుమంజనం, సహస్ర నామార్చన, శాత్తుముర్రై, విశేష పూలంగిసేవ జరుగుతాయని, భక్తులందరూ తరలిరావాలని కోరారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక


ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

నెల్లూరు ఏసీఎం	9985411424
నెల్లూరు ఏసీవో	9542727676
నెల్లూరు సిటీ	8179815202
నెల్లూరు రూరల్	8885688410
కోవూరు	8008894200

ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5



తిరుపతి
జిల్లా వార్తలు
సోమవారం 25 మార్చి 2024

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755

'తిరుపతి'లో కూటమి రెడీ

- అసెంబ్లీ అభ్యర్థిగా జనసేన తరపున ఆరణి శ్రీనివాసులే
- బీజేపీ ఎంపీ టికెట్ వరప్రసాదరావుకు
- శాసనసభ స్థానంపై సద్దుమణగనున్న అసమ్మతి

జిల్లాలో పెండింగ్ స్థానాలకు కూటమి పార్టీలు అభ్యర్థులను ప్రకటించాయి. జిల్లావ్యాప్తంగా పక్షం రోజుల పాటు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని, తిరుపతిలో జనసేన, టీడీపీ, బీజేపీలో అలజడిని రేకెత్తించిన జనసేన అసెంబ్లీ సీటు.. ఎట్టకేలకు ఆరణి శ్రీనివాసులుకే ఖరారైంది. మరోవైపు గూడూరు సిట్టింగ్ ఎమ్మెల్యే వరప్రసాదరావు తిరుపతి ఎంపీ స్థానానికి కూటమి తరపున బీజేపీ అభ్యర్థిగా బరిలో నిలవనున్నారు. దీంతో జిల్లాలో అన్ని స్థానాలకూ కూటమి పార్టీలు ఉమ్మడి అభ్యర్థులను ప్రకటించేసినట్టయింది. తిరుపతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఇప్పటి దాకా కొనసాగిన స్థానిక-స్థానికేతర వివాదాలకు ఇక ముగింపు పలికినట్టయింది. ఉమ్మడి అభ్యర్థి గెలుపు కోసం టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు కలసికట్టుగా ప్రచారంలోకి దిగే అవకాశముంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

జనసేన సీటు ఆరణికే



పేరు: ఆరణి శ్రీనివాసులు
పుట్టిన తేది: 15-5-1952
స్వస్థలం: జంగాలపల్లి, యాదమరి మండలం
నివాసం: చిత్తూరు
భార్య: సత్యవతి
కుమారులు: మదన్ మోహన్, జగన్‌మోహన్
వృత్తి: రాజకీయం, జేఎంసీ కన్‌స్ట్రక్షన్స్

తిరుపతి అసెంబ్లీ సీటు ఏ పార్టీకి కేటాయిస్తారు? అభ్యర్థిగా ఎవరు ఖరారవుతారు? అన్న ప్రశ్నలు జిల్లావ్యాప్తంగా జనంలోనూ, రాజకీయ వర్గాల్లోనూ ఆసక్తి రేపిన సంగతి తెలిసిందే. తిరుపతి ప్రాధాన్యత దృష్ట్యా అందరి దృష్టీ దీనిపైనే పడింది. తొలినుంచీ జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇక్కడి నుంచే పోటీ చేస్తారన్న ఊహాగానాలు మొదలయ్యాయి. టీడీపీతో జనసేన జతకట్టడంతో ఈ ప్రచారం మరింత ఎక్కువైంది. అయితే ఎందుకో తిరుపతి సీటుపై పవన్ ఆసక్తి చూపలేదు. దీంతో టీడీపీ, జనసేన నేతల నడుమ టికెట్ కోసం పోరు మొదలైంది. చివరి దశలో బీజేపీ నేతలూ రేసులోకి వచ్చారు. చివరికి ఈనెల 13వ తేదీ నాటికి తిరుపతి సీటు పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించినట్టు తేలిపోయింది. దానికి తోడు చిత్తూరు వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు జనసేనలో చేరడంతో ఆయనకే టికెట్ ఖరారైందని పార్టీ వర్గాలకు సమాచారమందింది. దీంతో 14వ తేదీన తిరుపతి టీడీపీ, జనసేన నేతలు సమావేశమై స్థానికులకే టికెట్ ఇవ్వాలని, లేదంటే బయటి వారికి సహకరించకూడదని తీర్మానించారు. ఆరణి శ్రీనివాసులు గో బ్యాక్ అంటూ సాయంత్రానికే ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలు దర్శనమిచ్చాయి. అదే రోజు రాత్రి తిరుపతి చేరుకున్న ఆరణి శ్రీనివాసులు 15న నగరంలోని ముఖ్య ఆలయాల్లో పూజలు జరిపి లాంఛనంగా ప్రచారం ప్రారంభించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతల ఇళ్లకు వెళ్లి వారిని కలిసి మద్దతు కోరేందుకు యత్నించారు. అయితే జనసేనలో డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, టీడీపీలో కోడూరు బాలసుబ్రమణ్యం మినహా మిగిలిన వారు అధినేతలు చెబితే తప్ప మద్దతివ్వమని చెప్పేశారు. వీరితో సర్దుబాటుకు ప్రయత్నిస్తూనే మరోవైపు శ్రీనివాసులు తన పని తాను చేసుకుంటూ పోయారు. పార్టీ ఎన్నికల కార్యాలయం కూడా ప్రారంభించారు. దానికి ఎవరూ హాజరు కాకపోగా అదే రోజు మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ నాయకత్వంలో టీడీపీ నాయకులు సమావేశమై స్థానికులకే టికెట్ ఇవ్వాలని అధిష్ఠానాన్ని డిమాండు చేశారు. స్థానికేతరులకు పనిచేయమని తేల్చి చెప్పారు. జనసేన నేతలను కూడా నాగబాబు మంగళగిరికి పిలిపించి మాట్లాడి పంపించారు. దీంతో అధిష్ఠానం పునరాలోచనలో పడిందని, అభ్యర్థిని మార్చేందుకు కసరత్తు చేస్తోందని ప్రచారం మొదలైంది. అయితే దానికి భిన్నంగా ఆదివారం జనసేన అధిష్ఠానం అధికారికంగా తిరుపతి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులంటూ ప్రకటన జారీ చేసింది. దీంతో అభ్యర్థి మార్పుపై తలెత్తిన ఊహాగానాలు, ప్రచారాలన్నీ బంద్ అయ్యాయి. కూటమి పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, శ్రేణులు కలసికట్టుగా ఉమ్మడి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు గెలుపు కోసం పనిచేయాల్సిన పరిస్థితి తలెత్తింది.అధికారిక ప్రకటన వెలువడ్డాక అసమ్మతి, అసంతృప్తి వ్యక్తం చేయడం లేదా స్థానికేతర అభ్యర్థి అంటూ వివాదం లేవనెత్తడం అధిష్ఠానాన్ని ధిక్కరించడమే అవుతుంది. టీడీపీ, జనసేన పార్టీలకు కీలమైన ఈ ఎన్నికల్లో అధిష్ఠానాలను ధిక్కరించే ప్రయత్నం నేతలు చేయరన్న భావన సర్వత్రా వ్యక్తమవుతోంది. దీంతో ఒకటి రెండు రోజుల్లో అంతా కలసికట్టుగా ప్రచారం ప్రారంభించే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

నేపథ్యం: క్లాస్ వన్ కాంట్రాక్టరు అయిన ఆరణి.. ప్రజారాజ్యం పార్టీ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. 2009 ఎన్నికల్లో ఆ పార్టీ తరపున చిత్తూరు అసెంబ్లీకి పోటీ చేసి ఓటమి చెందారు. ఆపై టీడీపీలో చేరి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. 2014 ఎన్నికల్లో అసెంబ్లీ టికెట్ ఆఖరి నిమిషంలో చేజారడంతో వైసీపీలో చేరి.. పోటీ చేసి ఓటమి చెందారు. 2019 ఎన్నికల్లో వైసీపీ నుంచి చిత్తూరు ఎమ్మెల్యేగా గెలిచారు. ఇప్పుడు వైసీపీ మొండిచేయి చూపడంతో ఈనెల 7న జనసేనలో చేరిన ఆయన.. తిరుపతి టికెట్ సాధించారు.

అందరినీ కలుపుకొని పోతా

టికెట్ ఆశించిన ఆశావహుల్లో అసంతృప్తులు ఉండడం సహజమే. అందరినీ కలుపుకొని ముందుకు పోతా. తిరుపతిలో నాకు సొంతిల్లు, వ్యాపార లావాదేవీలు, బంధువర్గం ఉంది. ప్రజారాజ్యం, తెలుగుదేశం పార్టీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా పనిచేయడంతో తిరుపతితో రాజకీయంగా, సామాజికంగా మెరుగైన పరిచయాలు ఉన్నాయి. మిత్రపక్షాల సహకారంతో జనసేన పార్టీ విజయం సాధిస్తుంది.

- ఆరణి శ్రీనివాసులు, జనసేన అభ్యర్థి

బీజేపీ ఎంపీ అభ్యర్థిగా వరప్రసాదరావు



ఢిల్లీలో కేంద్రమంత్రి అనురాగ్‌సింగ్ ఠాకూర్ సమక్షంలో ఆదివారం బీజేపీలో చేరుతున్న వరప్రసాదరావు

పొత్తులో భాగంగా తిరుపతి ఎంపీ సీటును బీజేపీకి కేటాయించిన సంగతి తెలిసిందే. ఆ పార్టీ తరపున గత ఉప ఎన్నికల్లో పోటీ చేసిన రిటైర్డు ఐఏఎస్ అధికారి రత్నప్రభ గానీ లేదా ఆమె కుమార్తె గానీ అభ్యర్థిగా ఉంటారన్న ప్రచారం జరిగింది. ఆ అంచనాలకు భిన్నంగా గూడూరు వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే వరప్రసాదరావుకు అవకాశం దక్కింది. రిటైర్డు ఐఏఎస్ అధికారి అయిన ఈయన.. 2009లో ప్రజారాజ్యం పార్టీ ద్వారా రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఆ ఏడాది తిరుపతి నుంచీ ఆ పార్టీ తరపున ఎంపీగా పోటీ చేసి ఓటమి చెందారు. 2014లో వైసీపీలో చేరి తిరుపతి నుంచీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. 2019లో గూడూరు నుంచీ అదే పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఈ సారి వైసీపీ అధిష్ఠానం ఆయనకు టికెట్ ఇవ్వకుండా మొండిచేయి చూపడంతో పార్టీకి దూరమయ్యారు. గత నెలన్నరగా ఆయన తిరుపతి పార్లమెంటు పరిధిలో తన అనుచరులను కలుసుకుని మద్దతు కోరారు. ఆదివారం ఢిల్లీలో బీజేపీ తీర్థం పుచ్చుకుని.. ఆ వెంటనే తిరుపతి ఎంపీ అభ్యర్థి అయ్యారు.

పేరు: వెలగపల్లి వరప్రసాదరావు
తల్లిదండ్రులు: మేరి, చిరంజీవులు
పుట్టిన తేదీ : 18-10-1953
స్వస్థలం : కృష్ణా జిల్లా, కొమ్మపూడి గ్రామం
భార్య : లక్ష్మి
కుమారుడు : నవీన్ గుప్తా
కుమార్తె : డాక్టర్ స్ఫూర్తి
విద్యార్హతలు, ఉద్యోగం: బయోకెమిస్ట్రీలో పీజీ. తమిళనాడు క్యాడర్‌లో 1983 బ్యాచ్‌కి చెందిన ఐఏఎస్ అధికారిఅయిన ఈయన ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగానూ పనిచేశారు.

ఉదయం పార్టీలో చేరి.. సాయంత్రం టికెట్ తెచ్చుకుని

గూడూరు సిట్టింగ్ ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాదరావు అన్నంత పని చేశారు. గూడూరు సిట్టింగ్ ఎమ్మెల్యే అయిన ఆయనకు వైసీపీ అధిష్ఠానం మొండిచెయ్యి చూపింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన.. చడీచప్పుడు లేకుండా తిరుపతి పార్లమెంటు పరిధిలో పర్యటించారు. గతంలో ఎంపీగా పనిచేసిన సమయంలో తనతో సన్నిహితంగా మెలిగిన అనుచరులను కలుసుకున్నారు. ఏదో ఒక పార్టీ తరపున ఎంపీగా పోటీ చేస్తానని, తనకు మద్దతివ్వాలని కోరుతూ వచ్చారు. ఆయన ప్రయత్నాలను ఎవరూ సీరియస్‌గా తీసుకోలేదు. పొత్తులో భాగంగా తిరుపతి సీటు బీజేపీకి దక్కుతుందనే అంచనాలు రాజకీయ వర్గాల్లో ముందునుంచీ ఉన్నాయి. ఈ క్రమంలో చాప కింద నీరులా ప్రయత్నాలు సాగించిన ఆయన ఢిల్లీకి వెళ్లి ఆదివారం ఉదయం బీజేపీలో చేరారు. సాయంత్రానికల్లా ఆ పార్టీ ప్రకటించిన ఎంపీ అభ్యర్థుల జాబితాలో తిరుపతి సీటు దక్కించుకుని అందరినీ సంభ్రమాశ్చర్యాలకు గురి చేశారు.

జోరందుకోనున్న 'కూటమి' ప్రచారం

ఇప్పటి వరకూ తిరుపతి అసెంబ్లీ, ఎంపీ సీట్లకు మాత్రమే కూటమి పార్టీలకు సంబంధించి అభ్యర్థుల ఎంపిక పెండింగులో ఉండేవి. మిగిలిన స్థానాలకు అభ్యర్థులను అధికారికంగా ప్రకటించేశారు. ఆయా చోట్ల అభ్యర్థులు ప్రచార రంగంలో దూసుకెళుతుండగా ఈ రెండు స్థానాల్లో మాత్రమే కూటమి పార్టీల కార్యకలాపాలు, ప్రచారాలూ స్తంభించిపోయాయి. ఆదివారం రెండింటికీ అభ్యర్థులను అధికారికంగా ప్రకటించడంతో జిల్లా వ్యాప్తంగా మూడు పార్టీల్లో పూర్తిస్థాయిలో ప్రచార కార్యక్రమాలు జోరందుకోనున్నాయి.

దశాబ్ద ప్రయాణమిలా

- ఎస్వీయూలో బీఏ ఎల్‌ఎల్‌బీ ఇంటిగ్రేటెడ్ కోర్సుకు పదేళ్లు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 24: శ్రీవేంకటేశ్వర (ఎస్వీ) యూనివర్సిటీలో 1974లో లా విభాగం ఏర్పాటైంది. ఇప్పటివరకు అనేక మంది పీజీ, పీహెచ్‌డీలు పూర్తిచేశారు. ఇదే విభాగంలో 2013 నుంచి ఐదేళ్ల బీఏ ఎల్‌ఎల్‌బీ ఇంటిగ్రేటెడ్ కోర్సును ప్రారంభించారు. ఈ ఏడాదితో ఈ కోర్సు పదేళ్ల కాలాన్ని పూర్తి చేసుకుంది. ఈ కోర్సు పూర్తి చేసినవారు న్యాయమూర్తులుగా, న్యాయవాదులుగా, పలు కంపెనీల న్యాయ సలహాదారులుగా స్థిరపడ్డారు. ఈ కోర్సులో భాగంగా విద్యార్థులను హైకోర్టు, సుప్రీంకోర్టుతోపాటు జైళ్ల పరిస్థితులను అవగాహన చేసుకోవడానికి క్షేత్ర పర్యటనలూ ఉంటాయి. తాజాగా ఢిల్లీలోని సుప్రీంకోర్టుకు తీసుకెళ్లారు. ప్రతినెలా న్యాయమూర్తులు, న్యాయవాదులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కోర్సును ఇప్పటివరకు 135 మంది పూర్తి చేశారు. 247 మంది చదువుకుంటున్నారు. వీరికి 8 మంది అకడమిక్ కన్సల్టెంట్లు, ఐదుగురు గెస్ట్ ఫ్యాకల్టీ బోధన చేస్తున్నారు. ఈ కోర్సుకు గౌరవ డీన్‌గా ప్రొఫెసర్ వీఆర్సీ కృష్ణయ్య వేతన రహిత సేవలను అందిస్తుండటం గర్హనీయం.

ఏపీ లాసెట్ ర్యాంకు ద్వారానే అడ్మిషన్

ఏపీ లాసెట్‌లో వచ్చిన ర్యాంకు ద్వారానే ఈ కోర్సులో అడ్మిషన్ ఉంటుంది. ప్రస్తుతం 55 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో 40 సీట్లను ర్యాంకులు, కేటగిరీలవారీగా, ఐదు మాత్రం ఆర్థిక వెనుకబడిన ఉన్నత వర్గాలు, 10 సీట్లను సెల్ఫ్ సపోర్టింగ్ ద్వారా భర్తీ ఇస్తారు. జనరల్ కేటగిరీలో అయితే ఏడాదికి రూ.40వేలు, సెల్ఫ్ ఫైనాన్స్ అయితే ఏడాదికి రూ.90వేల ఫీజు చెల్లించాలి. వీటికి ప్రభుత్వం నుంచి స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయం ఉంది. ఈ కోర్సుకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు ఉంది.

న్యాయవిద్యకు పెద్దపీట

బీఏ ఎల్‌ఎల్‌బీ ఐదేళ్ల కోర్సు పూర్తి చేసుకున్న వారు న్యాయమూర్తులయ్యారు. న్యాయ విద్యకు సమాజంలో ప్రాముఖ్యం పెరిగింది. విద్యార్థులకు ఉన్నత అవకాశాలు లభిస్తున్నాయి. అందువల్ల వర్సిటీలో న్యాయ విద్యకు పెద్ద పీట వేస్తున్నాం.

- శ్రీకాంత్ రెడ్డి, వీసీ, ఎస్వీయూనివర్సిటీ



రేపు దశమ వార్షికోత్సవం

సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు చంద్రచూడ్, దుర్గాప్రసాద్ రాక

బీఏ ఎల్‌ఎల్‌బీ కోర్సు దశమ వార్షికోత్సవం మంగళవారం జరగనుంది. రెండ్రోజులపాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇన్ లీగల్ ఎడ్యుకేషన్ అంశంపై వర్క్‌షాప్ ఉంటుంది. 28న సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. ఈ వార్షికోత్సవాల్లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధనుంజయ వై.చంద్రచూడ్, హైకోర్టు న్యాయమూర్తి దుర్గాప్రసాద్, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు మహాలక్ష్మీ పావని, జేబీ గుప్తా తదితరులు హాజరు కానున్నారు. శ్రీనివాసా ఆడిటోరియంలో నిర్వహించే వర్క్‌షాప్‌ను సీజేఐ ప్రారంభించనున్నారు.

'రాజంపేట' లోక్‌సభ బీజేపీ అభ్యర్థిగా నల్లారి కిరణ్



రాయచోటి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రాజంపేట లోక్‌సభకు కూటమి తరపున బీజేపీ అభ్యర్థిగా మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి పోటీ చేయనున్నారు. ఈ మేరకు ఆదివారం రాత్రి ఆ పార్టీ విడుదల చేసిన జాబితాలో ఆయన పేరు ప్రకటించారు. దీంతో కొన్ని రోజులుగా ఈ స్థానం విషయమై జరుగుతున్న ఊహాగానాలకు ఊహాగానాలకు తెరపడింది. తొలుత రాజంపేట ఎంపీ సీటుకు టీడీపీ తరపున గంటా నరహరి.. ఆ తర్వాత మాజీ ఎమ్మెల్యే పాలకొండ్రాయుడు కుమారుడు సుగవాసి బాలసుబ్రమణ్యం పేర్లు తెరపైకి వచ్చాయి. అయితే టీడీపీ, జనసేన కూటమిలోకి బీజేపీ కూడా చేరింది. ఈ స్థానాన్ని బీజేపీ ఆశించడంతో.. మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి పేరు ప్రముఖంగా వినిపించింది. అయితే తెలుగుదేశం పార్టీ తొలుత బీజేపీకి ప్రకటించిన ఆరు పార్లమెంటు స్థానాలలో రాజంపేట లేదు. ఆ తర్వాత విజయనగరం బదులుగా రాజంపేట స్థానాన్నే బీజేపీ కోరుకుంది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి విడుదల చేసిన అభ్యర్థుల జాబితాలో కిరణ్‌కుమార్‌రెడ్డి పేరుంది. కాగా, ఈయన సోదరుడు నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి తెలుగుదేశం పార్టీ తరపున పీలేరు అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు.

తండ్రి మరణానంతరం రాజకీయాల్లోకి..

మాజీ మంత్రి, తన తండ్రి అయిన నల్లారి అమరనాథరెడ్డి మరణానంతరం 1989లో వాయల్పాడు నుంచి కిరణ్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా తొలిసారి పోటీచేసి విజయం సాధించారు. 1995లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఓటమి.. 1999లో గెలుపు.. 2004లోనూ గెలుపొందారు. ప్రభుత్వ చీఫ్ విప్‌గా పనిచేశారు. నియోజకవర్గాల పునర్విభజనతో 2009లో పీలేరు ఎమ్మెల్యేగా గెలుపొంది స్పీకర్‌గా పనిచేశారు. వైఎస్ మరణానంతరం రోశయ్య తర్వాత ఉమ్మడి ఏపీ చివరి ముఖ్యమంత్రిగా 25.11.2010న కిరణ్ ప్రమాణ స్వీకారం చేశారు. విభజన చట్టానికి నిరసనగా 19.2.2014లో సీఎం పదవికి రాజీనామా చేసిన ఆయన.. 10.3.2014న జైసమైక్యాంధ్ర పార్టీ (జైఎస్‌పీ) స్థాపించారు. ఆ ఎన్నికల్లో ఒక్క చోటా గెలవకపోవడంతో రాజకీయాల నుంచి తాత్కాలికంగా నిష్క్రమించారు. 2018 జూలై 13న జేఎస్పీని రద్దు చేసి తిరిగి కాంగ్రెస్‌లో చేరిన ఆయన.. తర్వాత ఆపార్టీకి రాజీనామా చేసి గతేడాది ఏప్రిల్ ఏడో తేదీన బీజేపీలో చేరారు.

నేడు కుప్పానికి చంద్రబాబు రాక

కుప్పం, మార్చి 24: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు.. సోమ, మంగళవారాల్లో సొంత నియోజకవర్గమైన కుప్పంలో పర్యటించనున్నారు.

నేటి పర్యటన షెడ్యూల్ ఇలా..

సోమవారం ఉదయం 11.25 గంటలకు: బెంగళూరు ఎయిర్ పోర్టునుంచి హెలికాప్టర్ ద్వారా పీఈఎస్ కళాశాల ఆస్పత్రి ఆవరణలోని హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.

11.40: కుప్పం పట్టణం కొత్తపేటలో కన్యాకా పరమేశ్వరి ఆలయంలో పూజలు. **మధ్యాహ్నం 12 నుంచి 2వరకు:** టీడీపీ కార్యాలయంలో నాయకులతో సమావేశం. **3.20 నుంచి సాయంత్రం 5.30 వరకు:** కుప్పం ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్‌లో బహిరంగ సభ. **6-7 గంటల మధ్య** కేవీఆర్ కల్యాణ మండపంలో ముస్లింల ఇఫ్తార్ విందుకు హాజరవుతారు. **7.30 నుంచి రాత్రి 8.30 వరకు:** టీడీపీ కార్యాలయంలో నేతలతో సమీక్ష. **8.45:** ఆర్అండ్‌బీ అతిథి గృహంలో రాత్రి బస

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సోమవారం) : సా. 6.27
సహరి (మంగళవారం) : ఉ. 4.54

కళాకారులకు మరణం లేదు

శ్రీవేంకటేశ్వర చిత్రార్చన పుస్తకావిష్కరణలో నటుడు బ్రహ్మానందం

తిరుపతి (కల్చరల్), మార్చి 24: కళాకారులకు మరణం లేదని ప్రముఖ సినీ హాస్య నటుడు బ్రహ్మానందం అన్నారు. అందుకే అమరశిల్పి జక్కన్నను ఇప్పటికీ స్మరించుకుంటామని చెప్పారు. 202 మంది చిత్రకారులు గీసిన బొమ్మలతో శ్రీకళాక్షేత్ర ఆర్టిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రూపొందించిన శ్రీవేంకటేశ్వర చిత్రార్చన పుస్తకాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. దీనికి తిరుపతిలోని టీటీడీకి చెందిన శ్రీవేంకటేశ్వర శిల్ప కళాశాల వేదికైంది. ఈ సందర్భంగా జరిగిన సభలో బ్రహ్మానందం మాట్లాడుతూ.. కళాకారుడు గడ్డి పూలలోనూ సౌందర్యాన్ని గుర్తించగలడన్నారు. బురదలోని పందిని నేరుగా చూడడానికి ఇష్టపడనివారు.. అదే బురదలో ఉన్న పంది చిత్రాన్ని చూసినపుడు ఆగి, ఆ బొమ్మలోని నైపుణ్యాన్ని ఆస్వాదిస్తారని అన్నారు. కళలోని సౌకుమార్యం ఇదేనన్నారు. అనంతరం ఈ పోటీకి శ్రీవారి చిత్రాన్ని పంపిన వారంలోనే మరణించిన చిత్రకారుడి కుటుంబానికి శ్రీకళాక్షేత్ర సంస్థ ద్వారా రూ.2.17 లక్షల ఆర్థిక సాయాన్ని అందించారు. కాగా, 202 కళాకారుల్లో సుమారు 30 మంది శిల్ప కళాశాలలో చదువుకున్న పూర్వ ప్రస్తుత విద్యార్థులు కావడం విశేషం. రూ.6లక్షలకుపైగా వ్యయంతో రూపొందించిన ఈ పుస్తకంలోని బొమ్మలతో ఏర్పాటు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. కాలిగ్రఫీలో రాజేంద్ర.. బియ్యపు గింజపై రూపొందించిన శ్రీవారి బొమ్మ, బ్రహ్మానందం పెన్సిల్ షేడ్‌తో వేసిన వేంకటేశ్వరుడి చిత్రాన్ని పలువురు ఆసక్తిగా తిలకించారు. ఈ సభకు అధ్యక్షుడిగా ప్రముఖ కథా రచయిత ఆర్‌ఎం ఉమామహేశ్వరరావు వ్యవహరించారు. విశిష్ట అతిథులుగా టీటీడీ విద్యాశాఖ అధికారి ఎం.భాస్కరరెడ్డి, ఎస్వీయూ విశ్రాంత ఆచార్యుడు కిరణ్ క్రాంత్ చౌదరి, ప్రముఖ కవి డాక్టర్ కలువగుంట రామమూర్తి, కళాశాల ప్రిన్సిపాల్ కె.వెంకటరెడ్డి, అధ్యాపకులు డాక్టర్ సాగర్ గిన్నె, బి.ఆనంద్, ఎ.రామచంద్రయ్య, చిత్రకారులు కె.మహేశ్వర్, దేవీశ్రీ ప్రసాద్, కిరణ్ కుమారి, సీనియర్ చిత్రకారులు సింగపల్లి సత్యనారాయణ, కళాభిమానులు, విద్యార్థులు, నగరవాసులు పాల్గొన్నారు.



బ్రహ్మానందానికి శ్రీవారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న నిర్వాహకులు



ప్రదర్శనలో ఏర్పాటు చేసిన చిత్రాలు

మిగిలిన తుపాకుల మాటేమిటి?

తిరుపతి(నేరవిభాగం), మార్చి 24: సార్వత్రిక ఎన్నికల కోడ్ నేపథ్యంలో గన్ లైసెన్సులు పొంది ఉన్నవారు వెంటనే తుపాకులను పోలీసుల వద్ద డిపాజిట్ చేయాలని ఎన్నికల కమిషన్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. కలెక్టరేట్‌లో కలెక్టర్ సమక్షంలో జరిగిన సమావేశంలో ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా శనివారం వరకు లైసెన్సులు పొందిన 503 మందిలో 407 తుపాకులు ఆయా స్టేషన్లలో డిపాజిట్ చేశారని చెప్పారు. అయితే మిగిలిన 96 తుపాకుల సంగతేమిటన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. వీటిల్లో.. జిల్లాలో ఇప్పటికీ పేరుమోసిన స్మగ్లర్లు, కొంతమంది నాయకుల వద్ద గన్‌లు, పిస్టళ్లు అలాగే ఉన్నాయన్న ప్రచారం సాగుతోంది. ప్రధానంగా తిరుపతి కేంద్రంగా ఉంటూ నిన్నమొన్నటి వరకు వైసీపీతో అంటకాగి, ప్రస్తుతం తటస్థంగా ఉంటున్న నాయకుడు ఆత్మరక్షణ కోసం గన్ పెట్టుకున్నట్లు తెలుస్తోంది. అలాగే తిరుపతిలో కాపురముంటున్న ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పడమటి ప్రాంతానికి చెందిన ఒక స్మగ్లర్ వద్ద కూడా తుపాకీ ఉందని సమాచారం.

ఏప్రిల్ 6న బ్రహ్మాండమైన విడుదల
సందీప్ కిషన్, లావణ్యత్రిపాఠి, జాకీష్రాఫ్ నటించిన సైంటిఫిక్ ఫిక్షన్ చిత్రం మీ అభిమాన థియేటర్లలో



CONTACT 9652052424

టీడీపీ గెలుపు కోసం సమష్టి కృషి: నెలవల



సమావేశంలో మాట్లాడుతున్న నెలవల సుబ్రహ్మణ్యం

నాయుడుపేట టౌన్, మార్చి 24: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ విజయశ్రీ గెలుపు కోసం అందరూ సమష్టిగా కృషి చేయాలని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం నాయుడుపేట పట్టణం శ్రీకాళహస్తి బైపాస్ రోడ్డు సమీపంలోని శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గంలోని ముఖ్య టీడీపీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. అనంతరం నెలవల మాట్లాడుతూ టీడీపీలో అన్ని వర్గాలకు సముచితస్థానం ఉంటుందన్నారు. వైద్య వృత్తిని వదిలి ప్రజాసేవ కోసం వచ్చిన తన కుమార్తె విజయశ్రీ గెలుపు కోసం అందరూ కృషి చేయాలని కోరారు. వైసీపీ పాలనతో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని, మళ్లీ అభివృద్ధి జరగాలంటే చంద్రబాబునాయుడిని ముఖ్యమంత్రిని చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, కందల కృష్ణారెడ్డి, రఫీ, పనల గంగాప్రసాద్, వేమసాని శోభన్‌నాయుడు, నాగేంద్రరెడ్డి, శ్రీరామ్ ప్రసాద్, విజయకుమార్ నాయుడు, కిష్టయ్య, జీవీఆర్ నాయుడు, అవధానం సుధీర్, నానాబాల సుబ్బారావు, బాబు, బీరదవాడ నారాయణ, మల్లాం రవి, మధునాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్లస్టర్ ఇన్‌చార్జిలు కీలకంగా వ్యవహరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పాశిం సునీల్‌కుమార్

కోట, మార్చి 24: త్వరలో జరగబోవు ఎన్నికల్లో క్లస్టర్ ఇన్‌చార్జిలు కీలకంగా వ్యవహరించాలని గూడూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ అన్నారు. కోటలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం క్లస్టర్ ఇన్‌చార్జిల సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ వైసీపీ వైఫల్యాలను ప్రతి గడపకూ తీసుకువెళ్లి టీడీపీ గెలుపుక కోసం సైనికుల్లా పనిచేయాలన్నారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు సర్వోత్తమరెడ్డి, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా పరికరాలు



విద్యార్థులకు క్రీడా పరికరాలను అందజేస్తున్న జీఎం కృష్ణన్

కోట, మార్చ 24: స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు మండల పరిధిలోని చిట్టేడు జీవీఆర్ రొయ్యల పరిశ్రమ యాజమాన్యం రూ.35వేల విలువ చేసే క్రీడా పరికరాలను అందజేసింది. పరిశ్రమ వ్యవస్థాపకుడు గ్రంధి వెంకటేశ్వరరావు జయంతిని పురస్కరించుకొని ఆయన కుమారులు శ్రీనివాసరావు, బాలాజీ, చల్లరావు దాతృత్వంతో పరిశ్రమ జీఎం కృష్ణన్ చేతుల మీదుగా క్రీడా పరికరాలను విద్యార్థులకు అందజేశారు. హెచ్‌ఎం నిర్మలాదేవి, పీఈటీ కృష్ణ, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే పరిశ్రమ ఆవరణలో రక్తదాన శిబిరం నిర్వహించారు.

క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

చిల్లకూరు, మార్చి 24: ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా ఆదివారం చిల్లకూరులో స్థానిక పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ తేజస్విని మాట్లాడుతూ దగ్గు ఎక్కువగా ఉన్నప్పుడు సమీప ఆస్పత్రుల్లో గళ్ల పరీక్ష చేయించుకుని నిర్ధారించుకోవాలని సూచించారు. క్షయవ్యాధిని ప్రాథమిక దశలోని గుర్తించడం ద్వారా సులభంగా నయం చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో రవికుమార్, సురేంద్రరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మట్టల ఆదివారం



ఏరూరులో ఈత మట్టలతో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

చిల్లకూరు, మార్చి 24: మండలంలోని పలు గ్రామాల్లోని క్రైస్తవులు మట్టల ఆదివారం జరుపుకున్నారు. ఈత మట్టలను పూలతో అలంకరించి యేసు గీతాలను ఆలపిస్తూ గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అదేవిధంగా గూడూరు పట్టణంలో ఎస్‌ఎల్‌సీ చర్చి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పాస్టర్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కోట: మండల పరిధిలోని చంద్రశేఖరపురం, విద్యానగర్, గూడలి గ్రామాల్లో మట్టల ఆదివారం జరిగింది. ఆయా గ్రామాల్లో క్రైస్తవులు బైబిల్‌ను చేతపట్టుకొని మట్టలతో దైవవ్యాఖ్యం చేస్తూ ర్యాలీ నిర్వహించారు.

సామూహిక కుంకుమపూజ



కుంకుమ పూజలో భక్తులు

గూడూరు, మార్చి 24: స్థానిక అళఘునాధస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. లక్ష్మీజయంతి సందర్భంగా సామూహిక కుంకుమార్చన పూజలు జరిపారు. స్వామివారిని మోహినీ అలంకారంలో రాత్రికి గరుడ వాహనంపై ఉంచి వైభవంగా గ్రామోత్సవం జరిపారు. భక్తులు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

మడుగులో పడి బాలుడి మృతి

కోట, మార్చి 24: మడుగులో పడి బాలుడు మృతి చెందిన ఘటన కోట మండలం నెల్లూరుపల్లి కొత్తపాళెం పంచాయతీ పరిధిలో గల విశ్వనాథపుర అగ్రహారంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు... విశ్వనాథపుర అగ్రహారం దళితవాడకు చెందిన పాకం మణెయ్య - రమణమ్మ దంపతుల కుమారుడు జశ్వంత్(17) ఇటీవల పదో తరగతి పరీక్షలు రాశాడు. ఆదివారం తల్లి రమణమ్మతో కలసి గ్రామానికి దూరంలో ఉన్న ఓ మడుగులో బట్టలు ఉతికేందుకు వెళ్లారు. తల్లి బట్టలు ఉతుకుతుండగా జశ్వంత్ చేపలు పట్టేందుకు మడుగులో దిగాడు. లోతులోకి వెళ్లడంతో నీటి మునిగిపోయి ఈత రాక కేకలు వేశాడు. రమణమ్మ కేకలు వేయడంతో చుట్టుపక్కల పశువుల కాపర్లు జశ్వంత్ బయటకు తీసి కోట ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందిన్నట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ విషయమై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు.

మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వెంకటగిరిటౌన్, మార్చి 24: ఏపీ మోడల్ స్కూల్‌లో 2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఏపీ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ తులసీజ్యోతి తెలిపారు.

వెనామి రొయ్య పిల్లల్లో నాణ్యత డొల్ల

హేచరీల్లో నాసిరకం తల్లి రొయ్యల విక్రయం ● 3 నెలలకూ వంద కౌంట్ రాని వైనం ● తీవ్ర నష్టాల్లో ఆక్వా రైతులు





దిగుమతి అయిన రొయ్య పిల్లలు - కోట మండలం దొరువుకట్ట వద్ద సాగులో ఉన్న వెనామి రొయ్యలు

కోట, మార్చి 24: నాసిరకం వెనామి రొయ్య పిల్లలను విక్రయిస్తూ హేచరీల యజమానులు ఆక్వా రైతులను నిండా ముంచేస్తున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 78 రొయ్యల హేచరీలు ఉన్నాయి. ఇందులో కోట, వాకాడు మండలాల్లో గోవిందపల్లిపాళెం, కొత్తపట్నం, తూపిలిపాళెం తదితర ప్రాంతాల్లో సుమారు 10 హేచరీలు ఉన్నాయి. వాటిల్లో గతంలో 40 పైసలు పలికిన వెనామి రొయ్యపిల్ల ధర ప్రస్తుతం 32 నుంచి 33 పైసలు పలుకుతోంది. పాండిచ్చేరి, చెన్నై ప్రాంతాల్లో 40 నుంచి 45 పైసలు పలికిన వెనామి రొయ్యపిల్లలు ప్రస్తుతం 35 పైసలు(ఒక రొయ్యపిల్ల) పలుకుతున్నాయి. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని పలు హేచరీలకు అమెరికా, మెక్సికో దేశాల నుంచి తల్లి రొయ్య పిల్లలు దిగుమతి అవుతుంటాయి. తల్లి రొయ్య పిల్ల 38 గ్రాములు, మగ రొయ్యపిల్ల 35 గ్రాముల సైజులో ఉంటాయి. నెల నుంచి రెండు నెలలలోపు ఒక తల్లి రొయ్యపిల్ల నుంచి లక్షల్లో గుడ్లు ఉత్పత్తి కాగా, 50 మిలియన్లలో రొయ్యపిల్లలు గుడ్ల నుంచి ఉత్పత్తి అవుతాయి. అయితే హేచరీల యజమానులు పోటీని దృష్టిలో ఉంచుకొని తల్లి రొయ్య నుంచి నెల రోజుల లోపు పిల్లలను రైతులకు సరఫరా చేస్తున్నారు. ఆ రొయ్యలను రైతులు తీసుకెళ్లి సాగుచేస్తే మూడు నెలలకు కూడా వంద కౌంట్ రాకపోవడం, పూర్తిగా రొయ్యల్లో ఎదుగుదల పడిపోతుండటంతో ఆక్వా రైతులు నిలువుదోపిడీకి గురై అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.

మంచికి చోటిద్దాం.. వంచకులను తరిమేద్దాం: టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న గంగాప్రసాద్

ఓజిలి, మార్చి 24: రాష్ట్రాభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని రాబోయే ఎన్నికల్లో మంచికి చోటిచ్చి... వంచకులను తరిమేద్దామని పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్, సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రమణ్యం, రాష్ట్ర అధ్యక్షుడు పరసారత్నం, తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహయాదవ్ పిలుపునిచ్చారు. గతంలో టీడీపీని వీడి వైసీపీలో చేరిన పలువురు నాయకులు తిరిగి సొంతగూటికి చేరారు. వారందరికీ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆదివారం రాత్రి ఓజిలిలో జరిగిన సమావేశంలో నేతలు మాట్లాడుతూ కుటుంబ కలహాలను సరిదిద్దుకుని ముందుకు వెళుతున్న చందంగా నాయకులు సొంతగూటికి చేరారని ఆనందం వ్యక్తం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి నెలవల విజయశ్రీని గెలిపించుకోవడంతో పాటు చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేసుకోవడం పార్టీ ముందున్న కర్తవ్యంగా పేర్కొన్నారు. దుష్టపాలన అంతమొందించేందుకు ఇంతలా ముందుకు వస్తున్న నాయకులు, కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే తమ కళ్లముందు రాష్ట్రానికి ఉజ్వలమైన భవిష్యత్తు కనిపిస్తోందని అన్నారు. టీడీపీలో చేరిన వారిలో కురుగొండ సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు ఎద్దల ధనుంజయరెడ్డి, రావిపాడు, ఆరిమేనిపాడు, గుర్రంకొండ మాజీ సర్పంచులు కొండూరు సుబ్బారెడ్డి, కొండూరు ఈశ్వరరాజు, కొండూరు సురేష్‌రాజు, సీనియర్ నాయకులు రవీంద్రరెడ్డి, రుద్రరాజు శంకరరాజు, ఘట్టమనేని శ్రీనివాసులనాయుడు, బిల్లు చెంగయ్య, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట సొసైటీ మాజీ అధ్యక్షుడు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, సీనియర్ నాయకులు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఓజిలి మండల కన్వీనరు విజయకుమార్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి దాసరి నిరంజన్, నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, తిరుపతి పార్లమెంటు ముస్లిం మైనారిటీ ఉపాధ్యక్షుడు ఎస్‌కే ఖలీల్, నెలవల రాజేష్, నలమాకల కమలాకర్, మన్మదరావు తదితరులు పాల్గొన్నారు.

విజయశ్రీ గెలుపు కోసం సమన్వయంతో కృషి: జనసేన



జనసేన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ప్రవీణ్‌కుమార్

సూళ్లూరుపేట, మార్చి 24: టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీ విజయమే లక్ష్యంగా అందరూ సమన్వయంతో ముందుకెళ్తామని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక షార్ బస్టాండ్ వద్ద టీడీపీ నాయకులతో కలసి జనసేన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనకు అంతం పలికే రోజులు దగ్గరపడ్డాయన్నారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు మహిళలకు, యువతకు ఎంతో ఉపయోగకరమన్నారు. అనంతరం రాఘవయ్యపేటలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, జనసేన మండల అధ్యక్షుడు పొన్నా కాటయ్య, టీడీపీ నాయకులు వెంకట్, బుచ్చిబాబు, సాయినారాయణ తదితరులు పాల్గొన్నారు

రక్తదానంతో ప్రాణదానం



రక్తదానం చేస్తున్న యువకులు

వెంకటగిరి, మార్చి 24: రక్తదానం ప్రాణదానంతో సమానమని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక నాగేశ్వరి పంక్షన్ హాల్‌లో సినీ హీరో రామ్‌చరణ్‌తేజ జన్మదిన వేడుకల్లో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కేవీకే ప్రసాద్ నాయుడు, తిరుపతి పార్లమెంటు వాణిజ్య విభాగం అధ్యక్షుడు పునుగోటి విశ్వనాథ నాయుడు, పట్టణ అధ్యక్షుడు గంగాధర్, జనసేన నాయకులు కృష్ణయ్య, మాజీ కౌన్సిలర్ బీరం రాజేశ్వరరావు, మంకు ఆనంద్, నరిసంహులు, కాపా శ్రీనివాసులు నాయుడు, చలపతి తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: సినీ హీరో రామ్‌చరణ్‌తేజ జన్మదిన వేడుకల్లో భాగంగా చిరంజీవి సేవాసంఘం ఆధ్వర్యంలో ఆదివారం సూళ్లూరుపేటలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 63 మంది రక్తదానం చేశారు. తెలిపారు. కార్యక్రమంలో రాజారెడ్డి, చిరంజీవి సేవాసంఘం అధ్యక్షుడు మాబాషా, సభ్యులు హరిబాబు, శివ, రేవంత్, బాబు, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ కుంభకోణాన్ని టీడీపీకి ఆపాదించే కుట్ర

నరసింహ యాదవ్

తిరుపతి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ కుంభకోణంలో వైసీపీ నేతలు అడ్డంగా దొరికిపోయినప్పటికీ దాన్ని టీడీపీకి ఆపాదించే కుట్ర చేస్తున్నారని ఆ పార్టీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహయాదవ్ మండిపడ్డారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో వివేకా హత్య, కోడికత్తి కేసులను టీడీపీపైకి నెట్టే ప్రయత్నం చేశారన్నారు. జగన్ అధికారంలోకి వచ్చాక జరిగిన డ్రగ్స్ కేసునూ టీడీపీకి అంటగడుతున్నారన్నారు. విశాఖను రాజధానిగా మారుస్తానని చెప్పి డ్రగ్ క్యాపిటల్‌గా మార్చారని ఆరోపించారు. వీరభద్రరావు సోదరుడు కూనం పూర్ణచంద్రరావుకు, విజయసాయి రెడ్డికి సన్నిహిత సంబంధాలు ఉన్నాయన్నారు. డ్రగ్స్ కంటైనర్‌లో మార్ఫిన్, కొకైన్, హెరాయిన్, యాంఫటేమిన్, మెస్కిలన్ వంటి మత్తు పదార్థాలు ఉన్నట్లు సీబీఐ నివేదికలో పేర్కొందని గుర్తుచేశారు. గతంలో విజయవాడలోని ఆశి ట్రేడర్స్ పేరుతో ముంద్రా పోర్టులో రూ.21వేల కోట్ల విలువైన హెరాయిన్ దిగుమతిలో కాకినాడ ఎమ్మెల్యే చంద్రశేఖర్ రెడ్డి కీలకంగా వ్యవహరించారని ఆరోపించారు. ఇప్పుడు ఏకంగా రూ.50వేల కోట్ల విలువైన 25 వేల కిలోల డ్రగ్స్ ఉన్నాయని తేలిందన్నారు. డ్రగ్స్ సీజ్ చేయడానికి వెళ్లిన సమయంలో స్థానిక పోలీసులు తీవ్రంగా ప్రతిఘటించారని సీబీఐ అధికారులు తమ ఎఫ్‌ఐఆర్‌లో పేర్కొన్నారని, తాడేపల్లి ప్రమేయం లేకుండానే సీబీఐ అధికారులను పోలీసులు అడ్డుకోగలరా? అని ప్రశ్నించారు. ఈ కుంభకోణం వెనుక తాడేపల్లి ప్యాలెస్ హస్తం ఉందని ఆరోపించారు. గతంలో నిమ్మగడ్డ ప్రసాద్, కోనేరు ప్రసాద్ లాంటి వారితో వైసీపీ చేయించిన అక్రమాలు అందరికీ తెలిసినవేనన్నారు. సమావేశంలో కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, తిరుపతి క్లస్టర్ ఇన్‌చార్జి కృష్ణ యాదవ్, యశ్వంత్ రెడ్డి, మనోహర్ ఆచారి పాల్గొన్నారు.

12 మద్యం బాటిళ్ల స్వాధీనం

నాయుడుపేట టౌన్, మార్చి 24: పట్టణంలోని భరత్‌నగర్ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 12 మద్యం బాటిళ్లను ఎస్‌ఐ గోపి ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ఓజిలి మండలం రాజుపాళెం గ్రామానికి చెందిన వెంకటరమణయ్య ఎలాంటి అనుమతులు లేకుండా 12 మద్యం బాటిళ్లను తరలిస్తుండగా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

టీడీపీలో చేరికలు



మాజీ సర్పంచు నాగరాజుతో నెలవల సుబ్రహ్మణ్యం

నాయుడుపేట, మార్చి 24: సూళ్లూరుపేట మండలం కడపత్ర గ్రామానికి చెందిన మాజీ సర్పంచు నాగరాజు టీడీపీలోకి చేరారు. ఆయనకు నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం టీడీపీ కండువావేసి ఆహ్వానించారు. నాయుడుపేటలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొక్కు శంకరయ్య, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

గొడుగుల పంపిణీ

వెంకటగిరి టౌన్, మార్చి 24: స్వామి వివేకానందా యువసైన్యం ఆధ్వర్యంలో ఏపీపీ ప్రకృతికుమార్ చిరువ్యాపారులకు ఆదివారం గొడుగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వివేకానందా యువసైన్యం సభ్యులు పాల్గొన్నారు.

మహిళపై దాడి

బాలాయపల్లి, మార్చి 24: మహిళపై నలుగురు దాడి చేసిన ఘటన మండలంలోని పిగిలాం గ్రామంలో శనివారం రాత్రి చోటు చోటుచేసుకుంది. బాధితురాలి కథనం మేరకు.. పిగిలాం గ్రామానికి చెందిన ఈతముక్కల రత్నమ్మపై అదే గ్రామానికి చెందిన జొన్నల గడ్డ పెంచలరామయ్య, నాగరాజు, రజిత ఇంట్లోకి చొరబడి కత్తి, రాళ్లతో దాడి చేశారు. గాయపడిన ఆమె కూతురు సహాయంతో వెంకటగిరి ఆస్పత్రికి వెళ్లి ప్రథమ చికిత్స తీసుకుంది. అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి వెళ్లారు.

అయ్యప్పస్వామికి పూజలు



ప్రత్యేక అలంకరణలో ఉన్న అయ్యప్పస్వామి

కోట, మార్చి 24: మండల పరిధిలోని చిట్టేడులో గల సీతా సమేత గోవిందరామస్వామి ఆలయంలో ఆదివారం అయ్యప్పస్వామికి విశేష పూజలు జరిగాయి. ఉత్తరా నక్షత్రం పాల్గుణ మాసాన్ని పురస్కరించుకొని స్వామివారి చిత్రపటాలు, విగ్రహాలకు అభిషేకాలు చేసి విశేషంగా అలంకరించారు. అనంతరం అయ్యప్పస్వామి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

డీఎస్సీని వాయిదా వేయాలి

తిరుపతి(విద్య), మార్చి 24: ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పాఠశాల విద్యాశాఖ తలపెట్టిన డీఎస్సీని వాయిదా వేయాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్నాథం కోరారు. బైరాగిపట్టెడలోని సంఘ కార్యాల యంలో ఆదివారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు టెట్ ఫలితాలు విడుదల చేయలేదని, పరీక్ష కేంద్రాల ఎంపికకు, ఐచ్ఛికాల నమోదుకు వెబ్‌సైట్‌లో అవకాశం కల్పించలేదని గుర్తుచేశారు.

విజయశ్రీని గెలిపించుకుందాం: టీడీపీ



ప్రచారంలో టీడీపీ నేతలు

పెళ్లకూరు, మార్చి 24: మండలంలోని చెన్నప్పనాయుడుపేట పంచాయతీలో ఆదివారం టీడీపీ నేతలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి వట్టికుండల శేఖర్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, నాయకులు పేరం రమేష్‌నాయుడు, మధుసూదన్ నాయుడు, కందమూడి శివకుమార్, హరినాయుడు, రామకృష్ణా, మునీష్, నరేంద్రయాదవ్, ఆరూరు రమణయ్య, సుధాకర్‌రెడ్డి, యుగంధర్, గురవయ్య, పోలయ్య, రమణయ్య, సుబ్రహ్మణ్యం, వాసు, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

హుందాగా రాజకీయాలు చేయాలి

కోట, మార్చి 24: చీమకు కూడా హాని తలపెట్టని వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి దంపతులను కొవ్వూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అసభ్యకర పదజాలంతో దూషించడం మంచి పద్ధతి కాదని, ఇదే పరిస్థితి కొనసాగితే ఇబ్బందులు ఎదుర్కొక తప్పదని ఎన్‌డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్, కోటమ్మ ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి హెచ్చరించారు. కోటమ్మ ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఆయన భార్య ప్రశాంత్‌రెడ్డి ఎవరినీ విమర్శించకుండా వాళ్ల పనులు వాళ్లు చేసుకొని పోతుంటే ప్రసన్నకుమార్‌రెడ్డి విమర్శలు చేయడం తగదన్నారు. ప్రసన్నకుమార్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకోకపోతే ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఉన్న పది అసెంబ్లీ స్థానాలను వైసీపీ పోగొట్టుకోవడం జరిగిందన్నారు.

కోడ్ అమల్లోకి వచ్చినా వైసీపీ రంగులు తొలగించరా?



వైసీపీ రంగులతో ఉన్న బస్‌షెల్టర్

గూడూరు, మార్చి 24: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి 9 రోజులు గడుస్తున్నా వైసీపీకి చెందిన రంగులను అధికారులు తొలగించలేదు. స్థానిక జాతీయ రహదారి పోటుపాళెం కూడలి సమీపంలో చెన్నై, నెల్లూరు వైపు వెళ్లే ప్రయాణికులు వేచివుండేందుకు గతంలో ఎమ్మెల్యే వరప్రసాదరావు సొంతనిధులు బస్‌షెల్టర్లను ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఈ బస్‌షెల్టర్లకు ముందు ముద్రించి వున్న దాత పేర్లకు పేపర్లు అతికించారు. అయితే బస్‌షెల్టర్‌లకు వున్న వైసీపీ రంగులను తొలగించలేదు.

పేదలకు దుస్తుల పంపిణీ



గూడూరు, మార్చి 24: స్థానిక ముత్యాలపేట సెంటర్‌లోని గౌతమ బుద్ధుడి విగ్రహం వద్ద ఆయన జయంతి పురస్కరించుకుని ఏపీ ప్రజా కుల సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఐక్యవేదిక అధ్యక్షుడు ఎల్‌వీ సుబ్బయ్య, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, అనిల్‌కుమార్, నాగమణి, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక డీఎస్‌ఆర్ కమ్యూనిటీహాలులో రోటరీవెస్ట్‌క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. సనత్‌కుమార్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, రాఘవరెడ్డి, తళ్లూరు శ్రీనివాసులు, సుబ్రమణ్యం, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని నూర్‌బాషా దుదేకుల సంఘం ఆధ్వర్యంలో పేద ముస్లింలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చాన్‌బాషా, కయ్యూం, ఖాదర్‌బాషా, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

బస్టాండంతా అరుణాచలేశ్వరుడి భక్తులే

తిరుపతి(ఆర్టీసీ), మార్చి 24: పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం తమిళనాడు తిరువణ్ణామలై అరుణాచలేశ్వరుడి ఆలయానికి వెళ్లే భక్తులతో తిరుపతి సెంట్రల్ బస్టాండ్ నిండిపోయింది. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం 10గంటల వరకు పౌర్ణమి గడియలు ఉండడంతో భక్తులు పోటెత్తారు. 153 ప్రత్యేక బస్సులను కేటాయించినా సరిపోలేదు. సాయంత్రం వరకు రద్దీ కొనసాగింది. సీట్లు లభించక చాలామంది నిలబడివెళ్లారు. తిరుమల తుంబురుతీర్థ ముక్కోటి ఉండడంతో అంతకంటే ఎక్కువ బస్సులు కేటాయించడానికి వీలుపడలేదని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో కొంతమేర ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.79 కోట్లు

తిరుమల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.2.79 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ఉదయం ప్రకటించింది.